జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 4 సంచిక - 18 | పక్షపత్రిక | అక్టోబర్ 1-15, 2013






## గడ్డి కుంభకోణంలో లాలూకు శిక్ష





యూసఫ్‌గూడలో డ్రైనేజిని పరిశీలిస్తున్న జేపీ



మోతీనగర్‌లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న జేపీ



NRI SEV Foundation... వసంతనగర్‌లో ఉచిత ఫిజియోథెరపి సేవలు ప్రారంభించిన జేపీ

జన రాజకీయం కోసం...

లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక అక్టోబర్ 1-15, 2013

సంపుటి - 4 సంచిక - 18

## లోపలి పేజీల్లో...

సమాజహితం కోసం గాంధీజీని అనుసరిద్దాం .......5
రాజకీయాల్ని మార్చటంలో లోక్‌సత్తా కీలకపాత్ర ....7
బీహార్ నేతల మేత వెనక కథ.. ..........................8
వీవీపీల కేసులకు ప్రత్యేక కోర్టులు.......................10
ఓటరు చేతికి మరో ఆయుధం..........................12
చట్టబద్ధపాలన మన ప్రాథమిక హక్కు................15
ఓట్ల కోసం రైతులపై వేటు..............................18
రాష్ట్రంలో బడికి దూరంగా 28 లక్షల పిల్లలు ........22
బంగారానికి సబ్సిడీ (చర్చ కోసం వ్యాసం)...........23
రాష్ట్రపతికి జేపీ లేఖ.......................................25
పరిణత నాయకత్వం లేకే సంక్షోభాలు ..............28
ఐటిఐఆర్ ప్రాజెక్టుల్ని వికేంద్రీకరించండి..............29
కేంద్ర నిధుల పంపిణీకి కొత్త పద్ధతి ...................30
జిల్లా వార్తలు.............................................32

## సంపాదకవర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం
పి. రవిమారుత్
బండారు రామ్మోహన్‌రావు
ఓంకార్
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : కె. శ్రీలత
ఫోటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# తిరస్కరించే హక్కు ఒక ముందడుగు

## సంపాదకీయం

ఎన్నికలలో అభ్యర్థులందరినీ తిరస్కరించే అవకాశం ఓటర్లకు కల్పించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజకీయాల్ని బాగుచేసే దిశగా చిన్న, బలమైన ముందడుగు.

ఈ సంస్కరణను చేపట్టాలని 15 ఏళ్ల క్రితమే లోక్‌సత్తా ఉద్యమం భారత ఎన్నికల సంఘానికి సూచించింది. నియమావళిని ఎన్నికల సంఘం తనంతట తాను మార్చలేదు కాబట్టి ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. అయినా ప్రభుత్వం ఆ సూచన మీద స్పందించలేదు.

ఈవీఎంలలో, బ్యాలెట్ పత్రాలలో 'పై అభ్యర్థులలో ఎవరికీ కాదు' (నన్ ఆఫ్ ది ఎబౌ - ఎన్.ఓ.టి.ఎ) అని తిరస్కరించే అవకాశాన్ని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఈ తీర్పులో ఎన్నికల సంఘాన్ని కోరింది. ఓటు వేసే హక్కుతో పాటు, అభ్యర్థులెవరూ నచ్చలేదని వారిని తిరస్కరించే హక్కు. ఈ రెండూ ఓటర్ల ప్రాథమిక హక్కులు అని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది.

పాత అనుభవాలను బట్టి చూస్తే, తిరస్కరణ ఓటు అవకాశం ఆటనియమాలను మార్చలేదని, రాజకీయాలలో అద్భుతాలనేమీ సాధించజాలదు. అయితే, అర్హత లేని, అవాంఛనీయ అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలపకుండా రాజకీయ పార్టీల మీద ఈ సంస్కరణ ఒత్తిడిని పెంచుతుంది.

రాజకీయాలలో అందరూ దొంగలే కాబట్టి ఓటు వేయటంలేదని సాకు చెప్పి తప్పించుకునే ఒక వర్గం ఓటర్లు ఓటు వేయటాన్ని ఈ ఏర్పాటు ప్రోత్సహిస్తుంది. అటువంటి సందర్భాలలో తిరస్కరణ ఓటు ద్వారా తమ నిరసనను ఓటర్లు నమోదు చేసుకునే అవకాశం లభిస్తుంది.

బరిలో ఉన్న రాజకీయ పార్టీలు లేదా అభ్యర్థులు మరీ దారుణంగా ఉన్నప్పుడో, అసాధారణ భావోద్వేగాలు నెలకొన్న అరుదైన సందర్భాలలోనో మాత్రం ఈ తిరస్కరించే ఓటు సంస్కరణ బాగా ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా స్థానిక ఎన్నికలలో చాలా కాలంగా తమ సమస్యను అభ్యర్థులెవరూ పట్టించుకోలేదన్న ఆగ్రహం ఉన్నప్పుడు ఓటర్లు తిరస్కరణ ఓటును వినియోగించుకునే అవకాశముంది. కొన్ని సందర్భాలలో విపరీత స్థానిక డిమాండ్లకు మద్దతుగా కులం లేదా తెగల ప్రాతిపదికన కొన్ని వర్గాల ఓట్లను సమీకరించేందుకు ఇదో ఆయుధంగా కూడా ఉపయోగ పడుతుంది.

విశ్వసనీయత, నిబద్ధత, సమర్థత, మంచి చరిత్ర ఉన్న అభ్యర్థులను అన్ని పార్టీలూ ఎన్నికలలో నిలబెట్టినప్పుడు మాత్రమే రాజకీయాలలో నిజమైన మార్పు వస్తుంది. "దేశంలోని రాజకీయ సంక్షోభం రాజకీయ మార్గాలు, పౌరుల భాగస్వామ్యం ద్వారా మాత్రమే పరిష్కారమవుతుంది తప్ప కేవలం న్యాయవ్యవస్థ లేదా ఎన్నికల సంఘం ద్వారా కాదు". ■




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

*8-2-674బి/2/9, ప్లాట్ నం : 93*
*హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,*
*బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034*

**ఫోన్ నంబర్లు :**
***040- 23311817, 23311819, 23311820, 23312829***
***ఫ్యాక్స్ : 040-23310612***
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.



# సమాజహితం కోసం గాంధీజీని అనుసరిద్దాం

## జాతిపితకు ఘనంగా లోక్‌సత్తా నివాళి

గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి, లోక్‌సత్తా పార్టీ 8వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండాను జేపీ, లోక్‌సత్తా పార్టీ జెండాను కటారి శ్రీనివాసరావు ఎగరవేశారు. తన భావజాలానికి సంకేతంగా లోక్‌సత్తా పార్టీ నిలుపుకున్న గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ... న్యాయాన్ని పొందటానికి శత్రువుకి న్యాయం అందించటమే సరైన మార్గం అని గాంధీ చెప్పిన మాటను మన రాజకీయ పార్టీలు, నేతలు ఎంతమేరకు పాటిస్తున్నారు అని ప్రశ్నించారు. "మనందరం లోతైన సమీక్ష చేసుకోవాలి – గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రికి నివాళులర్పించే నైతిక హక్కు మనకుందా?" అనడిగారు.

మన అసహనం, అబద్ధాలు, ఇతరులకు న్యాయం అందించటంలో వైఫల్యం, భయాందోళనల్ని రేకెత్తించటం, మన సమస్యలకు ఇతరులను నిందించటం ఇవన్నీ ఆంధ్రప్రదేశ్ సంక్షోభానికి దారితీశాయన్నారు.

"ఏం జరిగినా, మనందరం తెలుగువాళ్లం, భారతీయులం. ఆధ్యాత్మిక నేతలంతా ఏమైపోయారు? కళాకారులు, రచయితలు ఎక్కడున్నారు? ఎందుకు వారంతా మౌనంగా ఉన్నారు?

గురువులు, సాధువులు, తారలు, కవులూ! – మేల్కొనండి, మీ గళం విప్పండి. రాజకీయాలపై, రాష్ట్ర విభజనపై ఏదోకపక్షం తీసుకోవద్దు" అని జేపీ కోరారు.

మనం ఒకే భాషను, ఒకే సంస్కృతిని పంచుకుంటున్నామని ప్రజలకు వారంతా గుర్తుచేసి, సామరస్యాన్ని, సమన్వయ ధోరణిని పెంపొందించాలని జేపీ అన్నారు. "ఏం జరిగినా, మనం ఒక కుటుంబంగా ఉంటాం. ఒకే ఉమ్మడి ఫలితాల్ని పొందుతాం. రాజకీయాలు ద్వేషాన్ని

పెంచకూడదు. రాజకీయాలకు అతీతంగా, అంతిమఫలితం ఏదైనా – విజ్ఞత, విద్వత్తు, ప్రజ్ఞ గల తెలుగువారు ఈ సందేశాన్ని వ్యాప్తిచేయాలి" అని జేపీ పిలుపునిచ్చారు.

తెలంగాణకు అనుకూలంగా, వ్యతిరేకంగా కొట్లాడుకుంటున్న తెలుగు ప్రజలు 'కన్నుకు కన్ను అంటే అందరం గుడ్డివారమవుతాం' అన్న గాంధీ నానుడిని గుర్తుకుతెచ్చుకుని సంక్షోభాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్‌నారాయణ్ విజ్ఞప్తి చేశారు.

పౌరుల సాధికారత కోసం వారికి పూర్తిస్థాయి ఉపాధి అవకాశాల్ని కల్పించాలని గాంధీ ఎప్పుడూ ప్రయత్నించేవారని, ఇప్పుడు మనదేశంలో తక్షణావసరం ఉద్యోగాల సృష్టేనని జేపీ అన్నారు. 20 ఏళ్లలో చైనా 20 కోట్ల ఉద్యోగాలను సృష్టిస్తే, భారతదేశం అదే సమయంలో 20లక్షల ఉద్యోగాలను సృష్టించగలిగిందన్నారు.

## రెండు ప్రతిజ్ఞలు

గాంధీ పుట్టినరోజు సందర్భంగా రెండు ప్రతిజ్ఞలు తీసుకోవటం ద్వారా మనం గాంధీ కలలుగన్న భారతదేశాన్ని నిర్మించగలమని జేపీ అన్నారు. మొదటిది, మనం బంగారం కొనకూడదు. ఒకవేళ కొనాల్సివస్తే, మనం అనుకున్నదాంట్లో 50 శాతం మాత్రమే కొనాలి.

"బంగారం దిగుమతిని ఆపితే, మనకు విదేశీ కరెన్సీ నిల్వల లోటు ఉండదు. బంగారం డిమాండ్‌ని మనం నియంత్రించలేకపోతే, మనం భారతదేశాన్ని నిర్మించలేం. బంగారం ఎటువంటి వాస్తవ అవసరాన్నీ తీర్చలేదు. మనదేశంలో 30,000 టన్నుల బంగారం ఉంది. ఇంత నిల్వ ప్రపంచంలో ఏ దేశంలో లేదు. అయినా మనం ఏటా 1000 మెట్రిక్‌టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంటున్నాం. ఎంతో బంగారం నిరుపయోగంగా పడివుంది. ఇప్పుడున్న బంగారంతో ప్రతి కుటుంబానికి 100 గ్రాములు ఇవ్వొచ్చు. దిగుమతులు లేకుండానే మన బంగారం అవసరాలు తీరతాయి. బంగారం వంటి వస్తువుల విషయంలో కూడా మనం స్వావలంబనను పెంపొందించుకోకపోతే, గాంధీని స్మరించుకునే అర్హత మనకి ఉండదు" అని జేపీ అన్నారు.

రెండోది, మనలో మౌలికావసరాలకు ఢోకాలేనివారు తమ ఆదాయం, సమయంలో 10శాతం సమాజానికి కేటాయించాలి.

ఈ ప్రతిజ్ఞను నెరవేర్చటానికి "మనమేదో కోల్పోవాల్సిన పన్లేదు, మన కుటుంబాల్ని పస్తులుంచాల్సిన పన్లేదు" అని జేపీ అన్నారు.

"మన ఆస్తులను మన పిల్లలకు వారసత్వంగా ఇచ్చేటప్పుడు, 90శాతం వారికి, 10శాతం ఏదోకరూపంలో సమాజానికి చెందేలా ఏర్పాటు చేయాలి. కుటుంబం మొదటి ప్రాధాన్యం. తర్వాత సమాజం. మన ఇచ్చే 10శాతం ఆదాయం, సమయం, ఆస్తులతో సమాజాన్ని – గ్రంథాలయం, పార్కు, పాఠశాల, ఆసుపత్రి, మ్యూజియం వంటి వాటిని నిర్మించాలి. మనం స్వచ్ఛందంగా సేవకు కేటాయించే సమయం పాఠాలు చెప్పటానికి, ట్రాఫిక్ నియంత్రణకు, అగ్నిప్రమాదాలను ఎదుర్కోవటానికి, పార్కులు, శ్మశానాల నిర్వహణకు వెచ్చించాలి.

"బంగారం డిమాండ్‌ని మనం తగ్గించి మనకున్నదాంట్లో 10శాతం సమాజానికిస్తే, మనం అభివృద్ధి చెందుతాం, దేశం అభివృద్ధి చెందుతుంది. గాంధీ సందేశాన్ని ఆధునీకరించి, మన నేటి అవసరాలకనుగుణంగా అన్వయించుకోవాలి. ప్రతిరోజూ సామాన్యమైన, ఆచరణాత్మకమైన పనులు చేద్దాం".

"మన వ్యక్తిగత అభివృద్ధి, సమాజ హితం కలిసికట్టుగా సాగినప్పుడే మనం ఒక దేశాన్ని నిర్మించగలం. ప్రతిరోజూ చిన్న పనులతో ఈ లక్ష్యసాధనను ప్రారంభిద్దాం" అని జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు.

లోక్‌సత్తా పార్టీ నేతలు డి.వి.వి.ఎస్ వర్మ, బండారు రామ్మోహనరావు, ఎన్. సరోజాదేవి, దోసపాటి రాము, ఈద చెన్నయ్య, పి. రవిమారుత్, వివిధ నియోజకవర్గాల నుంచి పెద్దసంఖ్యలో వచ్చిన నేతలు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ■

# రాజకీయాల్ని మార్చటంలో లోక్‌సత్తా కీలకపాత్ర : జేపీ

భారతదేశ రాజకీయాలలో ఏ పౌరసమాజ సంస్థ, ఏ రాజకీయ పార్టీ ఇంత స్వల్పకాలంలో సాధించనంత మార్పుని లోక్‌సత్తా సాధించిందని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. "అయినా, మంచి రాజకీయాల్ని, సుపాలనను, బలమైన ఆర్థిక వ్యవస్థను సాధించాలనే మా లక్ష్యాలను సాకారం చేసుకోవటానికి ఇంకా మైళ్లు ప్రయాణించాల్సి ఉంది" అన్నారు.

**అక్టోబర్ 2న లోక్‌సత్తా పార్టీ 7వ వార్షికోత్సవం సందర్భంగా లోక్‌సత్తా ప్రస్థానం, భవిష్యత్తు కార్యాచరణపై మంగళవారం ఇక్కడ మీడియాతో జేపీ ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ,** పార్లమెంటులో మూడు ప్రధాన రాజ్యాంగ సవరణలు రావటంలో లోక్‌సత్తా కీలకపాత్ర పోషించిందన్నారు. కేంద్రంలో, రాష్ట్రాలలో మంత్రివర్గ సభ్యుల సంఖ్యను పరిమితం చేసే 91వ రాజ్యాంగ సవరణ, సహకార సంస్థలకు స్వయంప్రతిపత్తిని కల్పించే 97వ రాజ్యాంగ సవరణ, న్యాయనియామకాల సంఘం (జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్) ఏర్పాటుకు అవకాశం కల్పించే 120వ రాజ్యాంగ సవరణ పూర్తిగా లోక్‌సత్తా కృషి వల్లే సాధ్యమయ్యాయన్నారు.

ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు విధిగా ఆస్తులు, నేరచరిత్ర వివరాల్ని వెల్లడించేందుకు, స్థానిక న్యాయాలయాల ఏర్పాటుకు, ప్రతి అభ్యర్థీ తన ఎన్నికల వ్యయాన్ని సమర్పించేందుకు, నల్లడబ్బును నియంత్రించేలా రాజకీయ పార్టీలకు నిధులను సమకూర్చేందుకు, సమాచారాన్ని ఒక హక్కుగా పొందేందుకు చట్టాల్ని తేవటంలో లోక్‌సత్తాది ప్రధానపాత్ర అని జేపీ వివరించారు. పౌరులకు ప్రభుత్వ సేవల్ని ఒక హక్కుగా అందించే సిటిజన్స్ సర్వీస్ (పౌరసేవల) గ్యారంటీ చట్టం, సమర్థులైనవారు న్యాయవ్యవస్థలోకి వచ్చేలా అఖిల భారత జ్యుడీషియల్ సర్వీసు (ఐజేఎస్) లోక్‌సత్తా చొరవతోనే రూపుదిద్దుకున్నాయని, అవి త్వరలో కార్యరూపం దాల్చనున్నాయని తెలిపారు.

రైతులను కాపాడేందుకు లోక్‌సత్తా చేసిన ప్రయత్నాలను జేపీ గుర్తుచేస్తూ, లోక్‌సత్తా ఉద్యమాల వల్లే వ్యవసాయరంగంపై చర్చ సమూలంగా మారిపోయిందని, రైతులు లాభాల్ని ఆర్జించేందుకు ఆహారధాన్యాలను ఎగుమతి చేసేలా కేంద్రప్రభుత్వాన్ని ఒప్పించి సాధించామని, వంటనూనెలపై దిగుమతి సుంకం విధించేలా చేసి మన రైతులకు అండగా నిలిచామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యం, బియ్యం రవాణాపై ఉన్న చట్టవిరుద్ధ ఆంక్షల్ని తొలగించాలని రైతు సత్యాగ్రహ యాత్ర చేసి ఇతర రాష్ట్రాలలో అమ్మి చూపించామని, దీంతో రాష్ట్రంలోని రైతులకు ఒక్క సీజన్‌లో, ఒక్క రకం ధాన్యం పంటకు రూ.3600 కోట్ల మేర లబ్ధి చేకూరిందని అన్నారు. జన్యుమార్పిడి పంటలను విస్తరించేందుకు రైతుల తరుపున లోక్‌సత్తాయే గట్టి పోరాటం చేస్తోందన్నారు.

రహస్య బ్యాలెట్ ద్వారా పార్టీ అధ్యక్షుడు సహా అన్ని పదవులకూ నేతలను ఎన్నుకున్న ఘనత దశాబ్దాల భారతదేశ చరిత్రలో లోక్‌సత్తా పార్టీకే దక్కుతుందని జేపీ గుర్తుచేశారు.

ఇప్పుడు – దామాషా ఎన్నికల పద్ధతి, బలమైన, సాధికారత గల స్థానిక ప్రభుత్వాలు, స్వతంత్ర ప్రతిపత్తిగల పటిష్టమైన అవినీతి వ్యతిరేక వ్యవస్థలు, పౌరులకు నాణ్యమైన ప్రభుత్వ సేవల్ని సకాలంలో గ్యారంటీగా అందించే చట్టం – సాధించుకోవాల్సి ఉందన్నారు.

సుపరిపాలన, ఆర్థికాభివృద్ధి కోసం జరుగుతున్న పోరాటంలో ముందుండాలని యువత, మహిళలు, రైతులు, మధ్యతరగతి, స్వయంఉపాధి ప్రజలకు జేపీ విజ్ఞప్తి చేశారు.

యువతలో చైతన్యం పెల్లుబుకుతుండటం, మధ్యతరగతి పెరగటం, మీడియా ప్రభావం వల్ల రాబోయే 5 – 10 ఏళ్లలో మనదేశ రాజకీయాలు పెనుమార్పును చూస్తాయనటంలో తనకు ఎటువంటి సందేహం లేదని జేపీ చెప్పారు.

లోక్‌సత్తా సాధించిన కొన్ని విజయాలను ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు.

లోక్‌సత్తా పార్టీ నేతలు డి.వి.వి.ఎస్ వర్మ, పి. రవిమారుత్, ఎన్. సరోజాదేవి, పి. శివాజీ, దోసపాటి రాము కార్యక్రమంలో పాల్గొన్నారు. ■

# బీహార్ నేతల మేత వెనక కథ..

బీహార్ రాష్ట్ర విభజన జరగకముందు నాటి కుంభకోణమిది. పశువుల దాణా, ఔషధాల పేరుతో పశు సంవర్ధకశాఖ విభాగం ఖాతా నుంచి 1990 తర్వాత వివిధ దశల్లో రూ. 950 కోట్లను అక్రమంగా విత్ డ్రా చేసుకున్నారు. ఇందుకు నకిలీ బిల్లులు పెట్టారు. ఈ కుంభకోణంలో దాణా సరఫరాదారులు, పశుసంవర్ధకశాఖ అధికారులు, రాష్ట్ర ఉన్నతాధికారులు, ఆర్‌జేడీ, కాంగ్రెస్, జేడీ(యు), భాజపా తదితర పార్టీలకు చెందిన నేతలు చేతులు కలిపారు.

### ఆర్‌సీ 20/ఎ96 కేసు ఏమిటి?

దాణా కుంభకోణానికి సంబంధించి సీబీఐ మొత్తం 64 కేసులను నమోదు చేసింది. ఇందులో ఆర్‌సీ 20/ఎ96 ఒకటి. 1992-96 మధ్య కాలంలో నకిలీ బిల్లులతో చైబాసా ఖజానా కార్యాలయం నుంచి రూ. 37.7 కోట్లను విత్ డ్రా చేసుకున్న వ్యవహారానికి సంబంధించి కేసు ఇది. ఇందులో 45 మంది నిందితులు. వీరిలో లాలూ ప్రసాద్ ఒకరు.

తొలుత కేసులన్నింటినీ పాట్నాలోని సీబీఐ ప్రాంతీయ కార్యాలయం నమోదు చేసింది. పాట్నాలోని సీబీఐ కోర్టుకు వీటిపై సీబీఐ నివేదించేది. పాట్నా హైకోర్టు పర్యవేక్షించేది. 2000, నవంబరులో బీహార్ విభజన జరిగిన తర్వాత 52 కేసులను రాంచీలోని సీబీఐ న్యాయస్థానానికి బదిలీ చేశారు. జార్ఖండ్ హైకోర్టు రాంచీ ధర్మాసనం ఈ 52 కేసులను పర్యవేక్షిస్తోంది. ఇప్పటివరకు 45 కేసుల్లో విచారణ పూర్తయింది. ఆర్‌సీ 20/ఎ96 కేసు సహా ఐదు కేసుల్లో లాలూ నిందితుడిగా ఉన్నారు.

### కుంభకోణం ఎలా బయటపడింది?

పశుసంవర్ధకశాఖ నిధులను కొల్లగొట్టడానికి అధికారులు. రాజకీయనేతలు, దాణా సరఫరాదారులు కలిసి ఒక మాఫియాగా ఏర్పడకముందు నుంచే పశుసంవర్ధకశాఖ నిధుల్లో అవకతవకలు జరిగేవి. 1992లో అవినీతి నిరోధక విజిలెన్స్ విభాగం ఇన్‌స్పెక్టర్ బిధు భూషణ్ ద్వివేదీ.. తొలుత ఈ



రాంచీ : సీబీఐ ప్రత్యేక న్యాయస్థానానికి వస్తున్న లాలూ ప్రసాద్ యాదవ్

కుంభకోణం వాసన పసిగట్టారు. ముఖ్యమంత్రి స్థాయిలో ప్రమేయం ఉందన్న అనుమానాలు వ్యక్తం చేస్తూ విజిలెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్‌కు నివేదిక పంపారు.

1992-93 నుంచి మొదలు 1995-96 వరకు కాగ్ ఏటా ఇచ్చిన వార్షిక నివేదికల్లో పశుసంవర్ధకశాఖ బండారాన్ని బట్టబయలు చేసింది. నిధులు అధికంగా విత్ డ్రా అయినట్లు తేల్చింది. అప్పటి లాలూ ప్రసాద్ ప్రభుత్వం.. ఈ నివేదికలను శాసనసభలో ప్రవేశపెట్టకుండా తొక్కిపెట్టింది. 1995 డిసెంబరులో కానీ వాటిని ప్రభుత్వం శాసనసభలో ప్రవేశ పెట్టలేదు. 1996, జనవరి 27న పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ అమిత్‌ఖారే.. తనకు అందిన సమాచారంతో చైబాసా పట్టణంలో చేసిన దాడులతో కుంభకోణం విశ్వరూపం బట్టబయలయింది. అధికారులు, సరఫరాదారులు, నేతలు కలిసి మాఫియాలా మారి నిధులను ఎలా కొల్లగొడుతున్నదీ అప్పుడే వెల్లడయింది. దీంతో లాలూ.. దర్యాప్తు కమిటీని వేశారు. ఆ కమిటీలోని వారికీ కుంభకోణంలో ప్రమేయముందని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలంటూ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలయింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు.. దర్యాప్తును సీబీఐకి అప్పగించాల్సిందిగా పాట్నా హైకోర్టు 1996 మార్చిలో ఆదేశించింది. కుంభకోణంలో అప్పటి ముఖ్యమంత్రి లాలూ పాత్ర ఉందని సీబీఐ దర్యాప్తులో వెల్లడయింది. దీంతో ఆయన్ను విచారించడానికి సీబీఐ.. గవర్నర్ అనుమతి కోరింది.

**లాలూ రాజీనామా వెనక కథ...**

లాలూను విచారించడానికి గవర్నర్ ఎ.ఆర్.కిద్వాయ్.. అంగీకరించిన తర్వాత.. సీబీఐ దాఖలు చేసిన అభియోగ పత్రాన్ని సీబీఐ న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. లాలూకు నాన్‌బెయిలబుల్ వారెంటు జారీ అయింది. లాలూ రాజీనామా చేయాలని అప్పటి ప్రధాని ఐ.కె.గుజ్రాల్ సంకేతాలిచ్చారు. 1997, జూలై 25న లాలూ.. తన శాసనసభ్యులతో భేటీ అయ్యారు. లాలూ భార్య రబ్రీదేవిని ముఖ్యమంత్రిగా ప్రకటించారు. ■

# లాలూకి శిక్ష అవినీతిపై పోరులో ఆశాకిరణం: జేపీ

రాష్ట్రీయ జనతాదళ్ అధ్యక్షుడు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ నేరం సీబీఐ కోర్టులో రుజువవటం వల్ల అవినీతిపరులకు శిక్ష పడుతుందని కొంత ఆశ కలుగుతోందని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ వ్యాఖ్యానించారు.

అయితే విచారణను పూర్తి చేయటానికి 20 ఏళ్లు పట్టిందని, అప్పీళ్లు కొన్ని దశాబ్దాలు పట్టవచ్చని జేపీ అన్నారు.

1990లనాటి దాణా కేసులో లాలూ ప్రసాద్, మరో 44 మంది అవినీతి నేరాన్ని సెప్టెంబర్ 30న సీబీఐ కోర్టు ధృవీకరించింది.

మరోవైపు, లాలూ ప్రసాద్ కేసు మనదేశంలోని రాజకీయ సంక్షోభాన్ని కూడా బట్టబయలు చేసిందని జేపీ అన్నారు. అవినీతి వ్యతిరేక పోరాటం, ఎమర్జెన్సీ నుంచి నాయకునిగా ఎదిగిన లాలూ ప్రసాద్ 1990లలో మీడియాకు, సామాన్య ప్రజలకు అత్యంత ప్రియతముడిగా కొనసాగారని, అయినా వ్యవస్థలోని తప్పిదంతో రాజీపడి అందులో భాగంగా మారిపోయారని అన్నారు. నైతిక వ్యవహారశైలి, రాజకీయాధికారం ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా ఉన్నాయని గుర్తించటంతో, కులం పేరుతో రెచ్చగొట్టి ప్రజల్ని సమీకరించటం, ఆశ్రిత పక్షపాతం, అవినీతి, సమాజంలో చీలికలు తేవటం, తాత్కాలిక జనాకర్షక పథకాలు, నేరరాజకీయాలు – వంటి అధికార రాజకీయ క్రీడలోని అన్ని అవకాశవాద విధానాలనూ లాలూ అవలంబించారన్నారు.

“లాలూ ప్రసాద్ ఎదుగుదల, పతనం రెండు ఒక తరం వైఫల్యానికి సంకేతం. రాజకీయ, ఆర్థిక సంస్కరణను ఆలస్యం చేయటం ద్వారా మనం మూడు దశాబ్దాలను వృధా చేశాం.

“ఈవేళ్టి భారతదేశపు రాజకీయాలలో నిజాయతీకి, అధికారానికి పొసగదు అనే పరిస్థితులు నెలకొన్నాయి. మంచి వ్యక్తులు రాజకీయాల్ని వదిలిపోవటమో లేక విలువలతో రాజీ పడటమో చేయాల్సి వస్తోంది. ■

# వీఐపీల కేసులకు ప్రత్యేక కోర్టులు : జేపీ డిమాండ్

రాష్ట్రంలోని, దేశంలోని ఉన్నతస్థాయి రాజకీయ నేతల, అధికారుల అవినీతిపై ప్రత్యేక కోర్టుల్ని, స్వతంత్ర ప్రాసిక్యూషన్‌ని ఏర్పాటు చేయాలని, నేరం రుజువైతే కఠిన శిక్షల్ని విధించాలని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ డిమాండ్ చేశారు.

**అవినీతి ఆస్తుల కేసులో మాజీ ముఖ్యమంత్రి డా॥ వైఎస్ రాజశేఖర రెడ్డి కుమారుడు - వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన రెడ్డికి బెయిలు లభించటంపై లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో జేపీ మీడియాతో మాట్లాడుతూ...** ఆధారాలు లేకుండా బెయిలు వెనక దురుద్దేశాలున్నాయన్న ఆరోపణలు చేయలేమన్నారు. నిందితుడు సాక్ష్యాలను ప్రభావితం చేసే ప్రమాదం లేకపోతే ఎల్లకాలం బెయిలు రాకుండా చేయటంలో అర్థం లేదన్నారు.

మహిళలకు రక్షణ విషయంలో నిర్భయ కేసు ఎలాగైతే ఒక సంకేతంగా నిలుస్తుందో, అలాగే ప్రజాప్రయోజనాల పరిరక్షణ విషయంలో వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన రెడ్డి కేసు ఒక సంకేతంగా నిలుస్తుందని, నిర్భయ కేసులోలాగే జగన్ కేసులో కూడా శరవేగంగా ప్రత్యేక కోర్టును ఏర్పాటుచేసి, స్వతంత్ర ప్రాసిక్యూషన్‌తో కేసుల విచారణను కొన్ని నెలల వ్యవధిలోనే పూర్తి చేయాలని జేపీ అన్నారు. జగన్ దోషిగా తేలితే చట్టపరంగా కఠినశిక్ష విధించాలని, నిర్దోషిగా తేలితే గౌరవప్రదంగా ప్రజలలో ఉంటారని అన్నారు.

కోర్టులలో విచారణ దశాబ్దాల తరబడి సాగుతూ దోషులు మీసం మెలేసుకుని బైట తిరుగుతుండటం, సిగ్గు విడిచేస్తే ఎంత అవినీతికి పాల్పడినా నాయకులుగానే చెలామణి అవ్వొచ్చనే పరిస్థితి ఏర్పడటం, ఎంత అవినీతికి అక్రమాలకు పాల్పడితే అంత గొప్ప నాయకుడనే పరిస్థితి ఏర్పడటం మనదేశ భవిష్యత్తుకి చాలా ప్రమాదకరమని జేపీ అన్నారు. నేతలు దర్యాప్తు సంస్థల్ని ప్రభావితం చేస్తుంటారనే భావన అన్ని వర్గాల్లో పాతుకుపోయిందని, కేసుల్ని పెండింగ్‌లో పడిపోయి అందరూ ఆ విషయాన్ని మర్చిపోయాక ఎప్పటికో తీర్పు వస్తుంది కాబట్టి ఇక ఆ విషయాల్ని ప్రజలు పట్టించుకోవటం లేదని, అవినీతి కేసుల విచారణను ఒక డ్రామాగా అనుకుంటున్నారని అన్నారు. వేగంగా న్యాయాన్ని అందించటానికి - సామర్థ్యం గల ప్రత్యేక ప్రాసిక్యూటర్లను ఏర్పాటుచేసి, న్యాయమూర్తులు రోజువారీ విచారణ చేపట్టి త్వరితంగా తీర్పులు వెలువరించే ఏర్పాటు చేయాలని, అవినీతిపరులైన రాజకీయ నేతలు, అధికారుల అన్ని ఆస్తుల జప్తునకు, కఠిన శిక్షలకు చట్టం తేవాలని, వ్యవస్థల పట్ల ప్రజలలో విశ్వాసాన్ని పునరుద్ధరించటం ఇప్పుడు తక్షణ కర్తవ్యమని అన్నారు.

ఏటా ప్రతి రాష్ట్రంలో పదిమంది పేరొందిన, పెద్ద అవినీతిపరుల్ని 15-20 ఏళ్లు జైలులో పెట్టి వారి ఆస్తులన్నిటినీ జప్తు చేసి, అవినీతిని ఏమాత్రం సహించబోమన్న సంకేతాన్ని ఆచరణలో చూపుతుంటే, అప్పుడు దేశ చరిత్రలో అసలైన మార్పు ఆరంభమవుతుందని జేపీ అన్నారు.



**అవినీతి అంతానికి లోక్‌సత్తా ఎప్పుడో బిల్లు తయారు చేసిచ్చినా, ఇప్పటిదాకా చర్యలు లేవు**

అక్రమాస్తులపై 2008లో ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత వైఎస్ రాజశేఖర రెడ్డి, చంద్రబాబు నాయుడు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నప్పుడు, ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకోవటం వల్ల అవినీతి పోదని, ప్రత్యేక కోర్టులో ఇద్దరి ఆస్తుల మీద విచారణ జరపాలని లోక్‌సత్తా డిమాండ్ చేసిందని, 2009లో తాను శాసనసభ్యునిగా కూడా సభలో ఇదే మాట చెప్పానని, అవినీతి అంతానికి సమగ్ర చట్టం కోసం బిల్లును రూపొందించి అన్ని పార్టీలకూ అందించానని, ఇంతవరకూ స్పందించలేదని జేపీ అన్నారు. ఇదే బిల్లును జాతీయస్థాయిలో కూడా రూపొందించి, ప్రభుత్వానికి, పార్టీలకు, పార్లమెంటరీ కమిటీకి, వివిధ రాజ్యాంగ సంస్థలలో పనిచేసిన సుప్రసిద్ధులకు, పౌరసమాజ నేతలకు అందించామన్నారు. లోక్‌సత్తా చెప్పినట్టు – **దర్యాప్తుసంస్థలైన సీబీఐ, ఏసీబీలకు స్వతంత్ర ప్రతిపత్తి, నిధులు, సిబ్బంది, సాధనాసంపత్తితో వాటిని పటిష్టం చేయటం, వీటిని జాతీయ, రాష్ట్ర స్థాయిలో బలమైన లోక్‌పాల్, లోకాయుక్త పరిధిలోకి తేవటం, వేగంగా కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు, స్వతంత్ర ప్రాసిక్యూషన్ ఏర్పాటు, అవినీతిపరుల ఆస్తులన్నిటినీ జప్తుచేయటం, వారికి కఠినశిక్షల్ని విధించటం** వంటి చర్యల్ని చేపట్టి ఉంటే ఈవేళ సీబీఐపై, విచారణపై అనుమానాలు వ్యక్తం చేయాల్సిన అవసరముండేది కాదన్నారు.

**మనదేశంలో ఇలా... అమెరికా వంటి దేశాలలో అలా**

మనదేశంలో వీఐపీలుగా ఉన్న సుఖ్‌రాం, మధు కోడా, మాయావతి, జయలలిత, ఎ.ఎం రాజా, లాలూ ప్రసాద్ యాదవ్‌ల మీద ఉన్న కేసులు ఏళ్లు గడుస్తున్నా విచారణ కొనసాగుతోందని జేపీ అన్నారు. ఫలితంగా, అటు రాజకీయ నాయకులు, ఇటు అధికారులు వందల, వేల కోట్లను నిస్సిగ్గుగా పోగేసుకుంటున్నారన్నారు. అందుకు విరుద్ధంగా, అమెరికా, బ్రిటన్ వంటి దేశాలలో అవినీతికి పాల్పడితే రాష్ట్ర గవర్నర్‌లు, అత్యంత ప్రముఖుల్ని సైతం వేగంగా విచారించి కఠిన శిక్షలు విధిస్తున్నారని, అన్ని ఆస్తుల్నీ జప్తుచేస్తున్నారన్నారు.

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన బరాక్ ఒబామా ఖాళీ చేసిన సెనేటర్ పదవి నియామకం కోసం చెక్కు ద్వారా ఎన్నికల నిధికి విరాళం అడిగిన ఇల్లినాయ్ గవర్నర్ రాడ్ బ్లాగోజీవిచ్‌ని రాత్రికి రాత్రి అరెస్టు చేసి ఆస్తులు జప్తు చేశారని, 14 ఏళ్ల జైలుశిక్ష విధించారని, ఆయన రాజకీయ జీవితం సమాధి అయిపోయిందని జేపీ అన్నారు. అలాగే అమెరికాలోని భారత సంతతికి చెందిన అరుణ్, కిరణ్ శర్మ అనే వైద్యదంపతులు వృత్తిలో అక్రమాలకు పాల్పడినందుకు వారి 42 మిలియన్ ఆస్తుల్ని జప్తు చేసి వారికి 15 ఏళ్లు జైలు శిక్ష విధించారన్నారు. ఎన్రాన్ ఉదంతం బైటపడిన వెంటనే వేగంగా విచారణ పూర్తి చేసి ఉన్నతాధికారులుగా ఉన్న కెన్నత్ లే, జెఫ్రీ స్కిల్లింగ్‌లకు 24 ఏళ్లు జైలు శిక్ష విధించారని, అక్రమాలకు పాల్పడినందుకు వారి ఆడిటింగ్ కంపెనీ ఆర్థర్ యాండర్సన్‌ను రద్దుచేశారని (సత్యం రామలింగరాజు కేసులో ఇదే తరహా తప్పుచేసిన ఆడిటింగ్ కంపెనీ మన రాష్ట్రంలో స్వేచ్ఛగా పనిచేసుకుంటూ, ప్రభుత్వంతో కూడా లావాదేవీల్ని నిర్వహిస్తోంది) అన్నారు. తప్పుడు ప్రయాణ భత్యాల్ని సమర్పించిందుకు బ్రిటన్‌లో 120 మంది పార్లమెంటు సభ్యులు శాశ్వతంగా రాజకీయాలకు దూరం కావాల్సి వచ్చిందన్నారు. అవినీతి ఆరోపణలు రావటం, అవినీతిని ఆపలేకపోవటాన్ని అవమానంగా భావించి దక్షిణ కొరియాలో ఎంతో ప్రతిష్ఠ కలిగిన మాజీ అధ్యక్షుడు రోహ్ మూ హ్యూ ఆత్మహత్య చేసుకున్నారన్నారు.

అవినీతిని ఆపాల్సిన ప్రభుత్వాలే భారత్‌లో అవినీతికి రక్షాకవచంలా పనిచేస్తూ, కంచే చేను మేసినట్టు వ్యవహరిస్తున్నాయని జేపీ అన్నారు. అనేక మంది ఉన్నతస్థాయి రాజకీయ నేతలు, అధికారులపై సీబీఐ దర్యాప్తునకు అనుమతివ్వకుండా మోకాలడ్డుతున్నాయన్నారు. దేశవ్యాప్తంగా వేలాది అవినీతి కేసుల దర్యాప్తునకు సీబీఐకి 3000కంటే తక్కువమంది సిబ్బందిఉంటే, అమెరికాలోని ఎఫ్‌బీఐకి 60,000మందికిపైగా ఉన్నారన్నారు.

వ్యక్తిగత నిజాయతీకే పరిమితం కాకుండా, వ్యవస్థీకృత, రాజ్యాంగాన్ని పరిరక్షించగల నిజాయతీతో వ్యవహరించి, అవినీతి అంతానికి తగిన వ్యవస్థీకృత ఏర్పాట్లకు లోక్‌సత్తా చేస్తున్న కృషితో కలిసిరావాలని జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు.

లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వి.వి.ఎస్ వర్మ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ■

# ఓటరు చేతికి మరో ఆయుధం

- ఎన్నికల్లో నేతలను తిరస్కరించే హక్కు
- ఈవీఎంల్లో 'ఎవరూ నచ్చలేదు' మీట
- బ్యాలట్ పత్రాల్లోనూ ఈ అవకాశం
- సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు
- ఎన్నికల సంఘానికి ఆదేశం

భ్రష్టుపట్టిపోయిన రాజకీయాలతో విసిగి వేసారిన భారత పౌరులకు సుప్రీంకోర్టు సరికొత్త ఆయుధాన్ని ఇచ్చింది. బరిలో నిలిచిన వారిలో ఒక్కరూ సజ్జనుడు కాకున్నా గత్యంతరం లేక వారిలోనే ఎవరో ఒకరిని ఎన్నుకోవడమో, ఓటు హక్కు వినియోగించుకోకపోవడమో చేస్తూ వస్తున్న ఓటర్లకు ఇక నుంచి తమ నిరసన తెలిపే హక్కు కల్పించింది. పోటీలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరూ నచ్చకుంటే తిరస్కరించే హక్కును కల్పిస్తూ సర్వోన్నత న్యాయస్థానం చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. గరళ రాజకీయాల ప్రక్షాళనకు వీలు కల్పిస్తూ వరుసగా తీర్పులిస్తున్న సుప్రీంకోర్టు... తాజాగా వెలువరించిన నిర్ణయం ఎన్నికల సంస్కరణల్లో ఓ మైలు రాయిగా భావించొచ్చు.

ఓటింగ్ యంత్రాల్లో (ఈవీఎం) అభ్యర్థులందరి పేర్లకు దిగువన 'పైన ఎవరూ కాదు (నన్ ఆఫ్ ది అబౌ-నోటా)' మీట పెట్టాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. బ్యాలట్ పత్రాల్లోనూ ఇటువంటి అవకాశం కల్పించాలంది. త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో దీన్ని అమలు చేయాలని సూచించింది. ఓటర్లకు తిరస్కార హక్కు ఇవ్వాలంటూ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పీయూసీఎల్) అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపిన కోర్టు ఈ తీర్పు వెలువరించింది.

"ఈవీఎంల్లో 'పైన ఎవరూ కాదు' అన్న మీట పెట్టాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తున్నాం. బ్యాలట్ పత్రాల్లోనూ ఈ అంశం ఉండాలి. దీనివల్ల... పోలింగ్ బూత్‌కు వచ్చిన ఓటర్లు... బరిలో నిలబడ్డ ఏ ఒక్కరికీ ఓటు వేయకూడదని నిర్ణయించుకున్నా వారి ఓటు హక్కు వినియోగించుకోవడానికి వీలవుతుంది. రహస్య ఓటు హక్కునూ కొనసాగించి నట్లవుతుంది." అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి.సదాశివం నేతృత్వంలో జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్, జస్టిస్ రంజన్ గొగోయ్‌తో కూడిన ధర్మాసనం తన 50 పేజీల తీర్పులో పేర్కొంది.

ఎన్నికల ప్రక్రియ ఆసాంతంలో మార్పులు తీసుకొచ్చే తిరస్కార హక్కు అత్యావశ్యకమని ఈ సందర్భంగా ధర్మాసనం



స్పష్టం చేసింది. ప్రజల ఆకాంక్షలను రాజకీయ పార్టీలు తప్పనిసరిగా గుర్తించే పరిస్థితి దీనివల్ల కలుగుతుందని, పార్టీలు నిలబెట్టిన అభ్యర్థులపై ఎక్కువ మంది ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తే అవి... సజ్జనులను నిలబెట్టే పరిస్థితి వస్తుందని పేర్కొంది. ఓటు హక్కును వినియోగించు కోవడం.. భావవ్యక్తీకరణ హక్కులో భాగమని, ఈ హక్కును రాజ్యాంగంలోని 19(1)(ఎ) అధికరణం కల్పించిందని, తిరస్కరించే హక్కును నిరాకరిస్తే భావప్రకటన స్వేచ్ఛను హరించడమేనని స్పష్టం చేసింది.

"ప్రజాస్వామ్యం బతకాలంటే, దేశంలో సరైన పరిపాలన ఉండాలంటే ప్రజాప్రతినిధులుగా ఉత్తములను ఎన్నుకోవడం అవసరం. ఉన్నత నైతిక విలువలున్న వారిని సానుకూల ఓటు ద్వారా ఎన్నుకుంటేనే సుపరిపాలన సాధ్యమవుతుంది. అందువల్ల.. 'వారిలో నాకెవరూ నచ్చలేదు' అన్న బటన్‌ను ఎంచుకునే అవకాశాన్ని చైతన్యపూరిత ప్రజాస్వామ్యంలో ఓటరుకు తప్పనిసరిగా కల్పించాలి. ఫలితంగా.. సజ్జనుడిని బరిలోకి దించాల్సిన తప్పనిసరి పరిస్థితి రాజకీయ పార్టీలకు ఎదురవుతుంది.'' అని చెప్పింది.



"ప్రస్తుత వ్యవస్థలో.. అసంతృప్తితో ఉన్న ఓటరు.. సాధారణంగా తన ఓటు హక్కు వినియోగించుకోడు. దీంతో ఆ ఓటరుకు బదులు అనైతిక శక్తులు ఆ ఓటు వేస్తాయి. ఈ పరిస్థితిని తప్పించాలన్నా తిరస్కార హకుక్క ఉండాల్సిందే. తిరస్కార హక్కు కల్పిస్తే.. ఓటర్లకు సాధికారత ఏర్పడుతుంది. ప్రస్తుత ప్రజాస్వామ్య వ్యవస్థలో వారి రాజకీయ భాగస్వామ్యం మరింత క్రియాశీలమవడానికి దోహదపడుతుంది. ఈ హక్కు.. అమలిన ఎన్నికల ప్రక్రియను ప్రోత్సహిస్తుంది. ఎక్కువమంది ప్రజలు ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలన్న లక్ష్యం నెరవేరుతుంది." అని పేర్కొంది.

పార్లమెంట్ సభ్యులకే ఇటువంటి అవకాశం ఉన్నప్పుడు సాధారణ ఓటర్లుకుంటే తప్పేమిటని ఈ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. "పార్లమెంట్‌లో ఉండే ఓటింగ్ యంత్రాల్లో 'ఎస్, నోస్, అబ్‌స్టెయిన్' మీటలుంటాయి. అబ్‌స్టెయిన్ (ఓటుకు దూరంగా ఉండడం) మీట నొక్కే అవకాశాన్ని సభ్యులకిచ్చారు. పిటిషనర్లు కోరుతున్న 'నోటా' మీట.. అబ్‌స్టెయిన్ మీట లాంటిదే. నోటా మీటను నొక్కడం ద్వారా ఓటరు.. తాను ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నట్లు చెప్పినట్లే. తన ఓటు విలువకు తగ్గ అభ్యర్థులు లేరని చెప్పినట్లే." అని ధర్మాసనం చెప్పింది.

'నోటా' కింద వేసే ఓట్లకు కూడా రహస్య కవచం కల్పించాలని ఎన్నికల సంఘాన్ని ధర్మాసనం ఆదేశించింది. "ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 79(డి), 41(2),(3), 49(ఒ) కింద.. ఓటు హక్కు, ఓటు నిరాకరణ హక్కులను చట్టబద్ధంగా గుర్తించారు. ఓటు వేయాలనుకున్నా, వేయొద్దనుకున్నా.. ఈ రెండు సందర్భాల్లోనూ గోప్యతకు అవకాశం కల్పించాల్సిందే." అని ధర్మాసనం స్పష్టం చేసింది.

సెక్షన్ 49(ఒ)లోని ప్రస్తుత నిబంధనల ప్రకారం.. పోలింగ్ బూత్‌కు వచ్చీ ఓటు హక్కును వినియోగించుకోకూడదని ఎవరైనా ఓటరు నిర్ణయించుకుంటే ఆ విషయాన్ని ప్రిసైడింగ్ అధికారికి చెప్పాల్సి ఉంటుంది. అప్పుడు ఆ అధికారి సంబంధిత పుస్తకంలో ఆ విషయాన్ని రాసి, ఆ ఓటరు సంతకం తీసుకుంటారు. ఈ నిబంధన కారణంగా.. ఓటరు నిర్ణయం బహిర్గతమయిపోతోంది. ఇది అనుచిత నిబంధన అని ప్రజా

ప్రాతినిధ్య చట్టంలోని 79(డి), 128ని ఉల్లంఘించడమేనని, రాజ్యాంగంలోని 19వ అధికరణాన్ని ఉల్లంఘించడమేనని స్పష్టం చేసింది.

“19వ అధికరణ.. ప్రతి వ్యక్తికీ మాట్లాడే హక్కు, విమర్శించే హక్కు, విభేదించే హక్కు కల్పించింది. ప్రజలు భిన్నాభిప్రాయాలు, భిన్న సిద్ధాంతాలు కలిగి ఉండడానికి ఇది అవకాశం కల్పించింది. ఓటు వేసేటప్పుడు తిరస్కార హక్కును కల్పించకపోవడమంటే.. భావ ప్రకటన స్వేచ్ఛను హరించినట్లే.” అని పేర్కొంది.

“ఎంతమంది ఓటర్ల భాగస్వామ్యం ఉందన్న దాన్ని బట్టి ప్రజాస్వామ్య బలాన్ని వివరించొచ్చు. తక్కువమంది భాగస్వాములయ్యారంటే దానర్థం.. ప్రజాస్వామ్యం పట్ల ఆసక్తిని కోల్పోతున్నట్లే. ఎక్కువమంది భాగస్వామ్యం ఉంటేనే ప్రజాస్వామ్యానికి మంచిది. ‘నోటా’ మీటను తీసుకురావడం వల్ల ఓటర్ల భాగస్వామ్యం పెరిగితే.. ఇక ప్రజాస్వామ్యానికి తిరుగులేదు. ఎన్నికల్లో పాలుపంచుకోవడం అంటే.. ప్రజాస్వామ్యంలో పాలుపంచుకున్నట్లే. భారత్‌లాంటి వృద్ధి చెందుతున్న ప్రజాస్వామ్య వ్యవస్థకు ఇది విజయసూచిక.” అని పేర్కొంది.

## చెల్లని ఓట్ల కిందే లెక్క!

ఓటు తిరస్కార హక్కును కల్పించడం వల్ల ఎన్నికల ఫలితాలపై ఎటువంటి ప్రభావం పడకపోవచ్చు. బ్యాలట్ పత్రాల పద్ధతి ఉన్నప్పుడు చెల్లని ఓటు ఎలా ఉండేదో.. తిరస్కార ఓటుకు కూడా చెల్లని ఓటుగానే పరిగణించే అవకాశం ఉంది. ఎన్నికల సంఘం వర్గాలు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. బరిలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే వారినే విజేతలుగా పరిగణిస్తారు. ఒక నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో ఓటర్లు తిరస్కార ఓటు వేస్తే దాన్ని ఏ విధంగా పరిగణించాలన్న దానిపై సందేహాలున్నాయి. తిరస్కార ఓట్లు.. అభ్యర్థులందరికీ కలిపి పడిన ఓట్ల కంటే అధికంగా ఉంటే.. అంటే తిరస్కార ఓట్లు 50 శాతం కన్నా ఎక్కువగా ఉంటే.. ఆ ఎన్నిక చెల్లుబాటు కాదని కూడా చెప్పవచ్చు అని కొన్ని వర్గాలు చెబుతున్నాయి. చివరకు ఎన్నికల సంఘం, న్యాయమంత్రిత్వ శాఖ, ప్రభుత్వం ఏ అభిప్రాయానికి వస్తాయన్న దానిపైనే దీని అమలు ఆధారపడి ఉంటుందని భావిస్తున్నారు. ఈ ఆదేశాలను ప్రభుత్వం సవాల్ చేయవచ్చు లేదా తీర్పు చెల్లని విధంగా ఆర్డినెన్స్ తీసుకొచ్చి, పార్లమెంట్‌కు చట్టం కోసం వెళ్లవచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి తిరస్కార హక్కుకు ఎన్నికల సంఘం సుముఖంగానే ఉంది. ఎన్నికల సంస్కరణల్లో భాగంగా ఈ వెసులుబాటును కల్పిస్తూ నిబంధనలను సడలించాలని గతంలో ప్రభుత్వానికి సిఫార్సు చేసింది కూడా. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం తిరస్కరించింది. ఎన్నికలు ఎన్నుకోవడానికే తప్పించి తిరస్కరించడానికి కాదన్నది ప్రభుత్వ వాదన. అవినీతి వ్యతిరేక ఉద్యమకారుడు అన్నా హజారే.. తిరస్కార హక్కు ఉండాలని డిమాండ్ చేస్తూ గతంలో విస్తృతంగా ప్రచారం చేశారు.

**ప్రచారం కల్పించండి :** తిరస్కార హక్కు ప్రయోజనాలను వివరిస్తూ ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు.. తీర్పు సందర్భంగా ఆదేశించింది. దశలవారీగా ఈ పద్ధతిని అమల్లోకి తీసుకు రావచ్చని, లేదంటే ప్రభుత్వ సహకారంతో మొత్తంగా ఒకేసారి అమల్లోకి తేవచ్చని చెప్పింది. ఎన్నికల సంఘానికి కావాల్సిన సహకారం అందించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ వెసులుబాటును ఈవీఎంల్లో చేర్చడానికి అదనంగా ఖర్చుకాదని, సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా మార్చాల్సిన పనిలేదని ఎన్నికల సంఘం లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాచారంలో ఉన్న సంగతిని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా గుర్తు చేసింది. న్యాయకమీషన్ తన 170వ నివేదికలో... తిరస్కార ఓటు భావనను సిఫార్సు చేసిన సంగతిని కూడా సుప్రీంకోర్టు గుర్తు చేసింది.

**భారత్ 14వ దేశం :** తిరస్కార ఓటు హక్కుపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తే ఈ సంప్రదాయాన్ని పాటించే 14వ దేశంగా భారత్ నిలుస్తుంది. తిరస్కార ఓటు సంప్రదాయాన్ని ప్రపంచంలో ఇప్పటివరకు 13 దేశాలు అవలంబిస్తున్నాయని సుప్రీంకోర్టు.. తీర్పు సందర్భంగా వెల్లడిస్తూ ఆ దేశాల పేర్లు పేర్కొంది. ఫ్రాన్స్, బెల్జియం, బ్రెజిల్, గ్రీస్, ఉక్రెయిన్, చిలీ, బంగ్లాదేశ్, స్టేట్ ఆఫ్ నేవడా, ఫిన్లాండ్, అమెరికా, కొలంబియా, స్పెయిన్, స్వీడన్‌లో ఈ పద్ధతి అమల్లో ఉన్నట్లు వెల్లడించింది. ■

# చట్టబద్ధపాలన మన ప్రాథమిక హక్కు

- పి.వి. గోపాలకృష్ణ

Rule of Law is our fundamental right అంటే, చట్టబద్ధపాలన మన ప్రాథమిక హక్కు.

రాజ్యాంగంలో ఆర్టికల్ 19లో ప్రత్యేకంగా ప్రాథమిక హక్కుల లిస్టులో లేకపోయినా, రాజ్యాంగబద్ధ, చట్టబద్ధ సుపరిపాలన మన ప్రాథమిక హక్కు. అదే Rule of Law. ఆర్టికల్ 19లో ఎక్కడ అలా రాసుందోనని వెతక్కండి. దానికి మన రాజకీయనాయకుల అనుమతీ అక్కర్లేదు. పార్లమెంటులో వారు దయతలచి మనకి మరో చట్టం చేయవలసిన అవసరమూ లేదు.

కానీ, అరవై ఐదేళ్ళలో మనం సాధించుకున్న దేమిటయ్యా అంటే, "Failure of good governance". It "is the obvious root cause for the current unsafe environment eroding the rule of law, and not the want of needed legislation" అని జస్టిస్ వర్మ కమిటీ అభిప్రాయం.

మంత్రైనా, ప్రజాప్రతినిదైనా, ప్రభుత్వోద్యోగైనా, కోర్టైనా రాజ్యాంగబద్ధంగానూ, చట్టబద్ధంగాను వారి వారి కర్తవ్యాలను నిర్వర్తించాలి. అది వారి ప్రాథమిక బాధ్యత. ఈ చట్టబద్ధ పాలనే సుపరిపాలనకు ఆధారం. అందువల్ల ప్రజాస్వామ్యంలో అది మన ప్రాథమిక హక్కు. ఆర్టికల్ 19లోనే మరెక్కడా అలా రాసుండక్కర్లేదు. సుపరిపాలన అంటే Rule of Law. చట్టం తన పని తాను చేసుకుపోవడం. రాజకీయ నాయకుల నోట ఈమాట జోకులా తయారైంది.

దానికి కారణం – మన పాలకులు – ప్రజా ప్రతినిధులు, మంత్రులు మరియు అధికారగణం – చట్టాలను అమలుపరిచే తీరులో without fear and favour అన్న నియమాన్ని విస్మరించడం. తనదాకా వస్తే ఒకలా పక్కవాడికైతే మరో లా. లా (చట్టం) ఒక్కోసారి ఒక్కోలా రూపాంతరం చెందక కేవలం Rule of Law రాజ్యం చేస్తే పరిస్థితులు మరోలా ఉండేవేమో. కానీ మన దేశంలో రాజ్యమేలుతున్నది వ్యక్తిపరమైన పాలన. కుర్చీలో కూర్చున్న వ్యక్తి ఉద్దేశించకపోయినా, అధికారం హస్తగతం చేసుకోడంలోను, చెలాయించడంలోను, అవకాశాలు దొరకబుచ్చుకోడంలోను కుటుంబ సభ్యులు, ఆ వెనకే బంధుగణం, ఆ తరవాత మిత్రులు, నమ్మకస్థులు దళారులు అలా వడ్డించేవాడి చుట్టూ ఉంటే సామాన్యుడు ఎక్కడో చివరి వృత్తంలో ఉంటాడు. మొదటి రెండు మూడు వృత్తాల్లోకి దూరి అధికార సామీప్యం కోసమే మనందరి తాపత్రయం. సింహాసనం అధిష్టించ గలిగిన ఆ నాయకుడి కరుణాకటాక్ష వీక్షణాలకోసం, దయతో పడేసే అధికార ఫలాల కోసం అర్రులు చాచడానికి అభ్యంతరం లేని జనం చుట్టూ ఉంటే, ఇంకా



Rule of Law అన్నది ఎక్కడుంటుంది? చట్టబద్ధమో కాదో ప్రభుత్వ కార్యాలయంలోనూ, పోలీస్ స్టేషన్లలోనూ, మరెక్కడైనా సరే అధికార జులుం చూపించలేని వాడూ ఓ ప్రజా ప్రతినిధా, మంత్రా, అధికారా? చట్టం తనపని తాను చూసుకోపోతుంది అని అంటూనే దానికి అడ్డు తగలగలిగితేనే వాడు ప్రజాప్రతినిధి, మంత్రి, అధికారి. అలా చెయ్యలేనివాడు ఉంటే ఎంత (ఉండక)పోతే ఎంత? అలా తమ ఉనికిని 'ప్రజా'రంజంకంగా చాటుకోగలిగిన వాడు సింహాసనంలో కూర్చుని ఉంటే మనం చూసేది అఖిలేష్ యాదవ్ పాలన తప్పితే మాయావతి పాలన. జయలలిత పాలన తప్పితే కరుణానిధి పాలన. చంద్రబాబు పాలన తప్పితే రాజశేఖర్ రెడ్డి కాకపోతే జగన్మోహన్‌రెడ్డో మరొకరో. కొత్త రాష్ట్రాలు పుట్టుకొస్తే, ఆ 'ప్రజ'లకీ తగిన నాయకులు తయారవుతారు సింహాసనాన్ని అధిష్టించడానికి, వారిని 'ప్రజా'రంజకంగా పాలించడానికి. అందరూ తమ 'ప్రజా'భిప్రాయానికి అనుగుణంగా 'పాలనానిర్వహణ' చెయ్యాలనుకునేవారే కదా. ఆ ప్రజలంటే ఎవరన్నదే అసలు ప్రశ్న. కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, వ్యాపారభాగస్వాములు, అంతరంగికులు, నమ్మకస్థులు, దళార్లు కానివాళ్ళు ప్రజలేనా? వీరందరిని దాటుకుని బయటి ప్రజానీకానికి అనువైన నిర్ణయాలు చట్టబద్ధంగా జరుగుతాయన్న నమ్మకంతో నిశ్చింతగా నిద్రపోగలిగే స్థితిలో నిజంగా సామాన్యుడున్నాడా? ప్రజాజీవితానికి సంబంధించిన నిర్ణయాలు పక్షపాతంతోనో, తనకన్నా పైనున్న వాడి మెప్పుకోసమో, ప్రాపకం కోసమో, భయంవల్లో కాకపోతే, ఈరోజు మనం మంత్రులని, అధికారులని జైళ్ళలో పేట్టే పరిస్థితి వచ్చేది కాదు.

Subversion of Law - చట్టవిద్రోహం, Abuse of Power - అధికార దుర్వినియోగం, Dereliction of Duty - కర్తవ్య నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వం – ఈ మూడూ చట్టం తన పని తాను చేసుకోడానికి ప్రతిబంధకాలు. అధికారమైకం తలకెక్కినవారికి, వారికి దగ్గరలోని రెండు మూడు వృత్తాల్లోని బంధుగణ అస్మదీయులకీ త్వరగా అంటుకునే రోగాలు. దానివల్ల ప్రజాస్వామ్యంలో మొదట నిర్వీర్యమయ్యేది. Rule of Law - చట్టబద్ధపాలన చట్టుబండలవడం. మంత్రులు – ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులతో సహా, అధికారులు IASలు, IPSల దగ్గర నుంచి, డిస్పాచ్ క్లర్కుల దాకా, జడ్జీలు, అడ్వకేట్ జనరళ్ళు, అటార్నీ జనరల్, గవర్నమెంట్ ప్లీడర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లదాకా విచక్షణాధికారం చెలాయించగల అధికారగణం అంతా ఈ రోగపీడితులే. నిర్భయంగా తప్పుడు, అవకాశవాద నిర్ణయాలు తీసుకోవడం ఈ రోగ లక్షణం. చట్టాన్ని ఎలాగంటే అలా వంచగలం అన్న ధీమా, అహంకారం, రాజును మించిన రాజభక్తి ఈ రోగానికి Breeding Grounds. ఈ రోగం బారినపడితే వ్యక్తిపరమైన పాలనే Rule of Law గా చలామణి అవుతుంది.

ఒక్కసారి ఓటేసాక, ప్రజల యొక్క ప్రజల కొరకు, ప్రజల వలన [of the people, for the people and by the people] అంటూ ప్రపంచంలోనే అతి పెద్ద 'ప్రజాస్వామ్యం' అనుకుంటున్న మన దేశంలో ప్రజలకి చట్టాలు తయారుచేసే ప్రక్రియలో భాగస్వామ్యం లేదు. ప్రజాభిప్రాయ సేకరణ చట్టరూపకల్పనలో భాగం కాకపోవడం విషాదం. ఒక బిల్లు చట్టంరూపంగా మారే ప్రక్రియలో ఏ దశలో కూడా ప్రజలు పాలుపంచుకొనే అవకాశమే లేదు.

త్రేతాయుగంలో ధర్మం నాలుగు పాదాలమీద నడిచేదట, ఇప్పుడు కలి ముదిరి ఒంటి కాలిమీద కుంటుతోందట. అంటే Rule of Law మీద మనకున్న దృష్టి, గౌరవం ఎంతో తెలుస్తోంది. ప్రభుత్వ అధికారగణంలో అలసత్వాన్ని నియంత్రించడానికి శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలకి నిబంధనలున్నాయి కాయితాలమీద. ఆచరణలో ఏ ఉద్యోగిమీద ఏ విషయంలో అలసత్వానికి ఏ క్రమశిక్షణ చర్య తీసుకున్నారు అని ఎప్పుడైనా ప్రభువులకి అంటే మనకి అంటే ప్రజలకి చెప్పే ప్రయత్నం జరిగిందా? Section 4, RTI Act కింద ప్రతి పబ్లిక్ అథారిటీ ఆయా శాఖలకి సంబంధించిన విషయాలన్నీ ప్రజలకి అందుబాటులో ఉంచాలి. Rule of Law ఉంటే ప్రత్యేకంగా అడగక్కర్లేకుండానే ప్రభుత్వ పని చేసే తీరును బట్టి ఇట్టే మనకి తెలిసిపోతుంది. అది సుపరిపాలన.

Subversion of Law - చట్టవిద్రోహం, Abuse of Power - అధికార దుర్వినియోగం, Dereliction of Duty - కర్తవ్య నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వం – ఇవి దేశద్రోహాలు. మన సేవకులు, బయట స్టూల్ మీద కూర్చునే తన పవర్ చూపించగలిగే బంట్రోతు నుంచి దేశాధ్యక్ష సింహాసనం మీద కూర్చునే వాడిదాకా, గాడి తప్పి ప్రవర్తిస్తే, శిక్షించడానికి, సమాచారహక్కు చట్టంతో పాటు పౌరహక్కుల పత్రం ఈ రెండింటితో పాటు Suversion of Law, Abuse of Power, Dereliction of Duty Prevention Act ` చట్టవిద్రోహం, అధికార దుర్వినియోగం, కర్తవ్యనిర్వహణ అలసత్వం నియంత్రణ చట్టం అన్న కొరడా కూడా ప్రజాస్వామ్యంలో ప్రభువులైనా ప్రజల చేతిలో ఉండాలి. ■

**P.V. Gopalakrishna,** *Advocate*
*Convener, Academy for Legal Literacy for ALL*
Email : pvgk10101@gmail.com Cell : 94404 70848

# లోక్‌సత్తా టైమ్స్
పక్షపత్రిక

**డా॥ జయప్రకాష్ నారాయణ్,** *ప్రధాన సంపాదకులు* **డి.వి.వి.యస్.వర్మ,** *సంపాదకులు*


# లోక్‌సత్తా పార్టీ 7వ వార్షికోత్సవం

## లోక్‌సత్తా టైమ్స్ ప్రత్యేక సంచిక

శ్రీ.........................................................

.............................................................

**ఆర్యా!**

డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రధాన సంపాదకులుగా లోక్‌సత్తా టైమ్స్ పత్రిక రాష్ట్రంలోని మేధావి వర్గాలలో, యువతలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. విలువైన సమాచారంతో, నిర్మాణాత్మకమైన విశ్లేషణలతో ఈ ప్రతిక అందరినీ ఆకట్టుకుంది.

2013 అక్టోబరు 19న హైదరాబాద్‌లో జరగనున్న లోక్‌సత్తా పార్టీ 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని లోక్‌సత్తా టైమ్స్ ప్రత్యేక సంచికను (అక్టోబరు 16-31) వెలువరిస్తున్నది.

రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ, ఆర్థిక, సామాజిక స్థితిగతులపై విలువైన సమాచారంతో ప్రత్యేక వ్యాసాలను ఈ సంచికలో అందిస్తుంది. అలాగే 7 సంవత్సరాలుగా లోక్‌సత్తా పార్టీ సాగించిన ఉద్యమాలు, సాధించిన విజయాలపై సమీక్షలను క్రోడీకరించి ఒక అపురూపమైన సంచికగా దీనిని రూపొందిస్తున్నాం.

లోక్‌సత్తా టైమ్స్ ప్రత్యేక సంచికలకు ప్రకటనకర్తల నుండి ఎల్లప్పుడూ ఎంతో ప్రోత్సాహం లభిస్తున్నది. ఈ సంచికను కూడా మీ వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, విద్య, వైద్య సంస్థల ప్రకటనలు ఇచ్చి సహాయ సహకారాలను అందించాల్సిందిగా కోరుతున్నాం.

**మీ ప్రకటనలు, చెక్కులు, డ్రాఫ్టులు, నగదు ఈ క్రింది అడ్రసుకు అక్టోబరు 10వ తేదీలోగా అందేలా పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.**

**అభినందనలతో....**

**(డి.వి.వి.యస్. వర్మ)**

సెల్ : *9866074023*

## లోక్‌సత్తా టైమ్స్

**ప్రత్యేక సంచిక ప్రకటన రేట్లు :**

| | బ్లాక్ & వైట్. | కలర్ |
|---|---|---|
| పూర్తి పేజీ | రూ॥ 5000 | రూ॥ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 10,000 | రూ॥ 20,000 |
| బ్యాక్‌పేజి | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15,000 |
| పూర్తి పేజీ సైజు | 7.5″ × 10.5″ | అంగుళాలు |
| బ్యాక్ పేజీ సైజు | 7.5″ × 8″ | అంగుళాలు |

## ప్రకటనలు, చెక్కులు, డ్రాఫ్టులు

మీరు పంపించే చెక్కులు, డ్రాఫ్టులు
**లోక్‌సత్తా టైమ్స్ హైదరాబాద్,** పేరుతో తీసుకోవాలి.
(నగదు అయితే ఈ ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్‌కు జమచేసి రశీదు పంపండి)

**ప్రకటనలు, డ్రాఫ్టులు, చెక్కులు ఈ క్రింది చిరునామాకు పంపించాలి**


**లోక్‌సత్తా టైమ్స్,**
*ఇం.నం. 8-2-674బి, ప్లాట్ నం. 93,హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034. ఫోన్ : 040 23311817, 23311819.* **Email Id : loksattatimeslsp@gmail.com**

# ఓట్ల కోసం రైతులపై వేటు

**- డివివియస్. వర్మ**

2014 ఎన్నికలు కాంగ్రెస్ పార్టీని తీవ్రంగా కలవరపరుస్తున్న విషయం ఇటీవల చర్యలలో స్పష్టంగా కనిపిస్తున్నది. ఎన్నికల్లో గట్టెక్కడమే లక్ష్యంగా దేశాన్ని ముంచేసే చర్యలకు ఆ పార్టీ ప్రభుత్వం బరితెగించింది. వరుసగా చేసుకుంటూపోతున్న చట్టాలు, ప్రకటిస్తున్న పథకాలు ఈ కలవరం నుండి పుట్టుకొచ్చినవిగానే కనిపిస్తున్నాయి.

ఓటు వేసే వారిలో అత్యధికులుగా వున్న పేద, బలహీన వర్గాలని దిగువస్థాయి మధ్యతరగతిని ఓటు బ్యాంకుగా స్థిరపరచుకోడానికి మార్చుకోడానికి తగిన పథకాలను, హక్కుల చట్టాలను ప్రకటిస్తున్నారు.

ఒక పక్క ప్రభుత్వ ఖజానాను ఈ పథకాలకు మళ్లిస్తూనే మరో పక్క రైతాంగాన్ని, వ్యవసాయ రంగాన్ని కుంగదీసేందుకు సంసిద్ధమైంది.

జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పేరుతో ఏటా 40,000 వేల కోట్లు ఉపాధి పేరుతో ఖర్చు చేసింది. ఇందులో 20 శాతం కూడా గ్రామీణ ప్రాంతంలో ఆస్తుల రూపంలో పెట్టుబడిగా మారలేదు. ఎందుకంటే ఏదో ఒక పని కల్పించడం పేరుతో దుబారా ఖర్చుగానే ఈ పథకం అమలు అయింది. ఈ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానించమని ఎందరు కోరినా ఈ ప్రభుత్వం పెడచెవిని పెట్టింది. ఇలాంటి అనుసంధానమే జరిగి వుంటే అది వ్యవసాయ రంగంలో మౌలిక వసతుల కల్పనకు దోహదపడేవి. వ్యవసాయ ఉత్పత్తులు పెరగడానికి, రైతుల పెట్టుబడులు తగ్గడానికి, నికరంగా ఉపాధి ఆదాయాల పెరుగుదలకు వినియోగపడేది. దీనికి భిన్నంగా కేవలం ఓటు బ్యాంకు కోసమే వినియోగించడం వల్ల అది వ్యవసాయ రంగం మీద, రైతుల మీద ప్రతికూల ప్రభావాన్ని కల్పించింది. తరుణంలో కూలీల కరువు, దాని ఫలితంగా అధిక చెల్లింపులతో లాభసాటి కావాల్సిన వ్యవసాయం గిట్టుబాటు కానిది అయింది. ఉపయోగకరమైనదిగా వినియోగించాల్సిన ఉపాధి పథకం ఉత్పత్తికి సంబంధం లేనిదిగా తయారైంది. అయినా దీనిని పునఃసమీక్ష చేసేందుకు ప్రభుత్వం సిద్ధం కావడం లేదు.

ఉపాధి హామీ తర్వాత ఆహారభద్రతను హక్కు చేసే చట్టం తెచ్చింది. దేశానికి ఆహారభద్రత అవసరం. అయితే అది వ్యవసాయం లాభసాటి అయినప్పుడే ఆహారధాన్యాల ఉత్పత్తి నికరంగా వున్నప్పుడే ఆ భద్రత స్థిరంగా వుంటుంది. కాని ఈ చట్టం రైతుల ఊసులేకుండా రూపొందించారు.



దేశంలో 75 శాతం మందికి కారుచౌకగా ఆహారధాన్యాలు అందించడం లక్ష్యంగా పెట్టుకుని ఎన్నికల ముందు దీనిని ప్రకటించడం పూర్తి ఓట్ల మీద దృష్టే తప్ప ఆహారభద్రత లక్ష్యం కాదని స్పష్టం అవుతున్నది.

1,20,000 కోట్లతో రూపొందించిన ఈ పథకం మన వ్యవసాయాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టేదిగా రూపొందించారే గాని దానిని గట్టెక్కించేదిగా లేదు. ఈ పథకం ఆహారధాన్యాల పంపిణీ రూపంలో ప్రభుత్వం ప్రకటించింది. మొత్తం ఆహారధాన్యాల వ్యాపారాన్ని దాదాపు 2/3 వంతు ప్రభుత్వమే నిర్వహించే స్థితి తెచ్చింది. వాటిని ఫుడ్ కార్పొరేషన్ గొడౌన్లలో నిల్వపెట్టి ప్రభుత్వమే పెద్ద నిల్వదారు అయింది. ఈ పద్ధతి వల్ల ఆహారధాన్యాలు ఉత్పత్తి చేసే రైతుకు దేశంలో స్వేచ్ఛా మార్కెట్ లేకుండా ప్రభుత్వం చేసింది. విదేశాలతో అమ్ముకునే స్వేచ్ఛ లేకుండా చేసింది. రైతులు ఆహారధాన్యాలను పండించడం దండగ అన్న స్థితిని తెచ్చింది. మరో పక్క ప్రభుత్వం నిర్ణయించే మద్ధతు ధరకీ, ప్రభుత్వం ఆహారభద్రతకి ఇచ్చే సబ్సీడీకి లంకెపెట్టి మద్ధతు ధరను ప్రభుత్వమే నియంత్రించే స్థితి తెచ్చింది.

పేదలకు ఆహార సబ్సీడీని వస్తురూపంలో కాకుండా నగదు రూపంలో ఇచ్చే ఏర్పాటు చేసి వుంటే పరిస్థితి వేరుగా వుండేది. రైతులకు విశాల మార్కెట్ వుండేది. పంటలను ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛ లభించేది. మొత్తం మీద ఈ పథకం ఆహారధాన్యాలు పండించే రైతులకు మార్కెట్ లేకుండా చేసే గుదిబండ అవుతుంది.

**మరోవిడత భూ సంస్కరణలు**

ఇప్పుడు మరోవిడత భూ సంస్కరణల పేరుతో ప్రభుత్వం హడావిడి ప్రారంభించింది. మొదటి విడత భూ సంస్కరణలు జమీందారీ వ్యవస్థ రద్దుకు ఉద్దేశించబడ్డాయి. భూముల మీద రైతులకు హక్కులు లభించాయి. వ్యవసాయ ఉత్పత్తి పెరగడానికి, పెట్టుబడి సమీకరణకు దోహదం చేసింది. అయితే జమీందారీ పద్ధతితోపాటు ఇచ్చిన రాయితీల వల్ల వారు పెద్ద భూదాందాల యాజమాన్యులుగా, భూస్వాములుగా మారారు.

1970 దశకంలో రెండవ విడత భూసంస్కరణలలో ఈ భూస్వాముల భూములపై నియంత్రణ కొంత సానుకూలమైన మార్పులకు– ఆర్థిక సామాజిక కోణంలో– దోహదం చేసింది. పారిశ్రామిక రంగంలో పెట్టుబడులకు ఊతం ఇచ్చింది. ఈ సంస్కరణలతో మిగిలిన భూమి, పంచిన భూమి అంతంత మాత్రంగానే ఉంది.

ఇప్పుడు 2013లో మరోవిడత భూసంస్కరణలకు కేంద్రం రంగాన్ని సిద్ధం చేస్తున్నది. బహుశ ఎన్నికలకు ముందే దీనిని చట్టం చెయ్యాలన్న అతురత కనిపిస్తున్నది.

భూమి లేని గ్రామీణ పేదలకు హక్కుగా భూమి కల్పించడం లక్ష్యంగా ప్రకటించారు. మాగాణి 10 ఎకరాలకు మెట్ట 15 ఎకరాలకు పరిమితి పెట్టాలని తలపెట్టింది. కాని వ్యవసాయ రంగంలో ఇప్పటికే వచ్చిన మార్పుల్ని ఈ ప్రభుత్వం గమనించినట్లు లేదు. ఓట్ల మీద వున్న శ్రద్ధ, భూమి లేని ప్రతి పేదవానికి సెంటో, కుంటో భూమి అన్న ఆశ కల్పించి వారిని ఓటు బ్యాంకు చేసుకోవాలన్న తలంపు తప్ప వ్యవసాయరంగం ఏమౌతుందన్న ధ్యాస ప్రభుత్వానికి లేదు.

ఇప్పుడు అసలు సమస్య భూకమతాలు చీలి, తునాతూనకలై పోవడం. 5 ఎకరాల లోపు వున్న కమతాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. దాదాపు 90 శాతం భూమి చిన్న కమతాలు, మధ్య కమతాల పరిధిలోనే వుంది. ఈ కమతాలు పెట్టుబడి పెట్టలేని స్థితిలో వున్నాయి. అప్పులపాలై ఆత్మహత్యల దిశగా ప్రయాణిస్తున్నాయి.

ఇప్పుడు కావలసింది మరో విడత భూసంస్కరణలు కాదు. ఈ చిన్న కమతాలను కనీస వ్యవసాయ ప్రమాణాలకు తగిన స్థాయికి గుదిగుచ్చడం. లేకపోతే చిల్లర వ్యవసాయం లాభసాటి ఉత్పత్తికి దోహదం కాదు.

విస్తీర్ణం, పెట్టుబడులు, యంత్రాల వినియోగం మధ్య ఉన్న సంబంధాన్ని చూడ నిరాకరిస్తే వ్యవసాయ రంగం వినాశనం పాలౌతుంది. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ రంగం మీద ఇప్పటికే 60 శాతం ఆధారపడి వున్న పరిస్థితిని మార్చాలి. వారికి ప్రత్యామ్నాయ ఉపాధినిచ్చే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను, వస్తూత్పత్తి పరిశ్రమల మీద దృష్టికేంద్రీకరించాలి. సమస్య ఒక చోట పరిష్కారం మరో చోట అన్న రీతిలో ప్రభుత్వం కేవలం ఓట్ల వేటులో విచక్షణ కోల్పోతున్నది.

మొత్తం మీద కేంద్ర ప్రభుత్వం వ్యవసాయరంగం మీద, రైతుల మీద కత్తులు దూస్తున్నది. ఓట్ల బంగారు గుడ్ల కోసం బాతునే బలి తీసుకునేందుకు సంసిద్ధమైంది. ■

# దేశంలో వ్యవసాయ కమతాలు, విస్తీర్ణం - 2011

| Sl. No. | Size Groups | Number of Holdings (in '000) | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | 1970-71 | 1976-77 | 1980-81 | 1985-86 | 1990-91 | 1995-96 | 2000-01* | 2005-06* | 2010-11 |
| 1 | Marginal | 36200 | 44523 | 50122 | 56147 | 63389 | 71179 | 75408 | 83694 | 92356 |
| 2 | Small | 13432 | 14728 | 16072 | 17922 | 20092 | 21643 | 22695 | 23930 | 24705 |
| 3 | Semi-Medium | 10681 | 11666 | 12455 | 13252 | 13923 | 14261 | 14021 | 14127 | 13840 |
| 4 | Medium | 7932 | 8212 | 8068 | 7916 | 7580 | 7092 | 6577 | 6375 | 5856 |
| 5 | Large | 2766 | 2440 | 2166 | 1918 | 1654 | 1404 | 1230 | 1096 | 1000 |
| | All Sizes | 71011 | 81569 | 88883 | 97155 | 106637 | 115580 | 119931 | 129222 | **137757** |

| Sl. No. | Size Groups | Operated Area (in '000 ha.) | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | 1970-71 | 1976-77 | 1980-81 | 1985-86 | 1990-91 | 1995-96 | 2000-01* | 2005-06* | 2010-11 |
| 1 | Marginal | 14599 | 17509 | 19735 | 22042 | 24894 | 28121 | 29814 | 32026 | 35410 |
| 2 | Small | 19282 | 20905 | 23169 | 25708 | 28827 | 30722 | 32139 | 33101 | 35136 |
| 3 | Semi-Medium | 29999 | 32428 | 34645 | 36666 | 38375 | 38953 | 38193 | 37898 | 37547 |
| 4 | Medium | 48234 | 49628 | 48543 | 47144 | 44752 | 41398 | 38217 | 36583 | 33709 |
| 5 | Large | 50064 | 42873 | 37705 | 33002 | 28659 | 24160 | 21072 | 18715 | 17379 |
| | All Sizes | 162318 | 163343 | 163797 | 164562 | 165507 | 163355 | 159436 | 158323 | **159180** |

| Sl. No. | Size Groups | Average (in ha.) | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | 1970-71 | 1976-77 | 1980-81 | 1985-86 | 1990-91 | 1995-96 | 2000-01* | 2005-06* | 2010-11 |
| 1 | Marginal | 0.40 | 0.39 | 0.39 | 0.39 | 0.39 | 0.40 | 0.40 | 0.38 | 0.38 |
| 2 | Small | 1.44 | 1.42 | 1.44 | 1.43 | 1.43 | 1.42 | 1.42 | 1.38 | 1.42 |
| 3 | Semi-Medium | 2.81 | 2.78 | 2.78 | 2.77 | 2.76 | 2.73 | 2.72 | 2.68 | 2.71 |
| 4 | Medium | 6.08 | 6.04 | 6.02 | 5.96 | 5.90 | 5.84 | 5.81 | 5.74 | 5.76 |
| 5 | Large | 18.10 | 17.57 | 17.41 | 17.21 | 17.33 | 17.20 | 17.12 | 17.08 | 17.37 |
| | All Sizes | 2.28 | 2.00 | 1.84 | 1.69 | 1.55 | 1.41 | 1.33 | 1.23 | **1.16** |

* Excluding Jharkhand.

# భూ సంస్కరణల చట్టాలు.. రాష్ట్రాలలో భూ పరిమితి

(ఎకరాలలో)

| State | Irrigated Land with two crops | Irrigated Land with one crop | Dry land |
|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 |
| As recommended in 1972 National Guidelines | 10-18 | 27 | 54 |
| Proposed in Agenda Notes 1985 of Regional Minister's Conference | 12 | 18 | 30 |
| Andhra Pradesh | 10 to 18 | 15 to 27 | 35 to 54 |
| Assam | 17 | 17 | 17 |
| Bihar | 15 to 18 | 25 | 30 to 45 |
| Gujarat | 10 to 18 | 15 to 27 | 20 to 54 |
| Haryana | 18 | 27 | 54 |
| Himachal Pradesh | 10 | 15 | 30 to 70 |
| Jammu & Kashmir | 9 to 12.5 | 9 to 12.5 | 15 to 23 (in Ladakh 19) |
| Karnataka | 10 to 20 | 25 to 30 | 54 |
| Kerala | 12 to 15 | 12 to 15 | 12 to 15 |
| Madhya Pradesh | 18 | 27 | 54 |
| Maharashtra | 18 | 27 | 54 |
| Manipur | 12 | 12 | 15 |
| Mizoram | nil | nil | nil |
| Odisha | 10 | 15 | 30 to 45 |
| Punjab | 17 | 27 | 51 |
| Rajasthan | 18 | 27 | 54 to 175 |
| Tamil Nadu | 12 | 30 | 60 |
| Sikkim | 12.5 | 12.5 | 50 |
| Tripura | 10 | 10 | 30 |
| Uttarakhand | 18 | 27 | 45 |
| Uttar Pradesh | 18 | 27 | 45 |
| West Bengal | 12 | 12 | 17 |
| Andaman & Nicobar Islands | nil | nil | nil |

Note : 1. The actual limits for lands in Karnataka and Uttar Pradesh are higher due to classification of land.

2. The actual ceiling limits in Himachal Pradesh and Rajasthan are higher due to hilly terrain and desert lands.

3. 1 Acre = 0.404686 Hectare.

Source :Department of Land Resources, New Delhi.

# రాష్ట్రంలో బడికి దూరంగా 28 లక్షల పిల్లలు

- **జనాభా లెక్కల్లో బట్టబయలు**
- **1.27 లక్షలే అంటున్న విద్యాశాఖ**

రాష్ట్రంలోని 1.57 కోట్ల మంది బడి ఈడు (6-15 వయస్సు) పిల్లల్లో దాదాపు 28 లక్షల మంది పాఠశాలకు వెళ్లడం లేదని 2011 జనాభా లెక్కల్లో తేలింది. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, రాజీవ్ విద్యామిషన్ చెపుతున్న లెక్కలుచూస్తే పాఠశాల మొహం చూడని బడి ఈడు పిల్లలు కేవలం 1.27 లక్షల మందే. ఇప్పుడు ఎవరి లెక్కలు నిజమో తేలాల్సి ఉంది. జనాభా లెక్కలను పాఠశాల ఉపాధ్యాయులే ఇల్లిల్లూ తిరిగి సేకరించారు. పాఠశాల విద్యాశాఖ తరపున బడికి రాని బడి ఈడు పిల్లల గణాంకాలు సేకరించింది కూడా వీరే. రెండు విభాగాల నివేదికలను పొంతన లేక పోవడం విమర్శలకు తావిస్తోంది.

- జనాభా లెక్కలను సేకరించిన ఏడాది (2010-11) విద్యాశాఖ విడుదల చేసిన బడి ఈడు పిల్లల నివేదికను చూస్తే ఆ ఏడాది రాష్ట్రంలో అన్నీ పాఠశాలల్లో కలిపి 1.29 కోట్ల మంది విద్యార్థులు ఉన్నట్లు తేలింది. జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో బడి ఈడు పిల్లలు 1.57 కోట్ల మంది. అంటే మిగతా 27.57 లక్షల మంది బాలలు బడికి దూరంగా ఉన్నట్లే.
- విద్యాశాఖలో భాగమైన రాజీవ్ విద్యా మిషన్ రాష్ట్రంలో 1.27 లక్షల మంది పిల్లలు మాత్రమే బడి బయట ఉన్నారని కేంద్రానికి నివేదిక పంపింది. 27.57 లక్షల మంది పిల్లలు బడిలో చేరలేదని జనాభా లెక్కల విభాగం చెబుతోంది. గొప్పకు తక్కువగా లెక్కలు చూపడం వల్ల కేంద్రం నుంచి వచ్చే నిధుల్లో కోత పడుతుంది.
- ఎంతమంది బడి ఈడు పిల్లలు పాఠశాలకు దూరంగా ఉన్నారో కచ్చితమైన అంకెల్లేకుండా ప్రణాళికలు రూపొందిస్తే ఫలితం ఉండదని ఎం.వి.పౌండేషన్ వ్యాఖ్యానించింది.
- విద్యాహక్కు చట్టం ప్రకారం అప్పుడే పుట్టిన శిశువు నుంచి 14 ఏళ్లలోపు పిల్లలందరి వివరాలు పంచాయితీయే సేకరించాలి. ఈ చట్టం అమల్లోకి వచ్చి మూడేళ్లవుతున్నా పంచాయితీ స్థాయిలో లెక్కల్లేవు. ■



# బంగారానికి సబ్సిడీ - ఆహారానికి అక్కర్లేదా

**యూ.** పీ.ఏ. ప్రభుత్వం జారీ చేసిన ఆహారభద్రత ఆర్డినెన్స్‌ను, ఆ ప్రయత్నం వెనక ఉన్న అమర్త్య సేన్ భావాలను విమర్శించడానికి ముందు మనం ఏం మాట్లాడుతున్నమో ఆలోచించడం మంచిది. ఈ ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తున్న వారు అందరూ ప్రత్యేక సదుపాయాలున్న వారూ, శక్తిమంతులైన వారే. వీరి వాదనల రణగొణ ధ్వని ముందు మరే వాదానలు వినిపించకుండా పోతున్నాయి. వీరు గంభీరమైన సిద్ధాంతాలు వల్లిస్తూ పేదల పేరున సబ్సిడీలు మేసేస్తుంటారు. పేదలు మాత్రం ఏ ఎదుగూబొదుగూ లేకుండా ఉన్నచోటే ఉండేట్టు చూడడానికి ప్రయత్నిస్తుంటారు. ఈ మాట అన్నంత మాత్రాన ఈ ఆర్డినెన్స్‌ను సమర్థిస్తున్నట్లు అనుకోనక్కర్లేదు. ఇది ఓట్లు దండుకోవడానికి యూ.పీ.ఏ. వేసిన రాజకీయ ఎత్తుగడ అయిన మాట వాస్తవమే. అసలు ఓట్లు సంపాదించడానికి కాకపోతే ఎవరైనా అధికారంలో ఎందుకుంటారు? ఈ చట్టం వల్ల దేశ ద్రవ్యలోటు పెరిగిపోతుంది. ఈ మాట నిజమే. దీనివల్ల భారత రేటింగ్ తగ్గిపోనూవచ్చు. దుష్పరిపాలనను భరించలేక, విధానాలలో అనిశ్చితి వల్ల అంతర్జాతీయ పెట్టుబడులు మరలిపోవచ్చు. పెట్టుబడి పెట్టేవారూ ఎటూ వెనుదిరుగుతూనే ఉన్నారు. రూ. 80,000 కోట్ల పెట్టుబడులు పెట్టాల్సిన పోస్కో, ఆర్సిలార్ మిత్తల్ ఎటూ వెనుదిరిగాయి. ఇది పెట్టుబడుల ఉపసంహరణ రుగ్మతకు పరాకాష్ట. పేదల ఆకలి తీర్చడం వల్ల పరిస్థితి మరీ దిగజారుతుందని ఈ సిద్ధాంత రాద్ధాంతాలు చేసే వారు చెబుతుంటారు. దారితప్పిన ప్రభుత్వ ఆహార సబ్సిడీని, ఆ ఆలోచనకు వెన్నుదన్నుగా ఉన్న అమర్త్యసేన్‌ను విమర్శించే ముందు దాన్ని విడిగా చూడకుండా సరైన దృక్పథంలోంచి చూస్తే తప్ప అసలు వాస్తవం కనిపించదు. ఆహార భద్రత గురించి చర్చిస్తున్నప్పుడు మనం మేసేస్తున్న మరో ఆరు సబ్సిడీలను దృష్టిలో ఉంచుకోవాలి. ఆ తర్వాత ఈ అంకెలను ఒకదాని తర్వాత మరొకటి పెట్టి పోల్చి చూడాలి. అప్పుడు ఎవరికి ఎలాంటి సబ్సిడీలు అందుతున్నాయో తెలుస్తుంది. ఈ సబ్సిడీలు పేదలకు అందాలా లేక సంపన్నులకే దక్కాలా అని ఆలోచించవచ్చు. "విశేష సదుపాయాలను అనుభవిస్తున్న వారి అపారమైన శక్తి, అధికారం వల్ల భారత అభివృద్ధి ప్రాధాన్యతలు దెబ్బతింటున్నాయి" అని అమర్త్యసేన్, జాన్ డ్రీజ్ తమ 'ఆన్ అన్సర్టెన్ గ్లోరీ' అన్న గ్రంథంలో రాశారు. ఈ పుస్తకం తప్పకుండా చదవాల్సిందే.

> **చర్చ కోసం వ్యాసం...**
> - మన సబ్సిడీలను ఎలా ఇస్తున్నారు?
> - మెరుగైన మార్గాలు లేవా?
> - మీ అభిప్రాయాలు రాయండి

**ఇంధనం**

వేగంగా దూసుకెళ్లే స్పోర్ట్స్ కార్లు నడిపితే చాలా సరదాగా ఉంటుంది. ఇలా ఎగురుతూ వెళ్లే కార్లకు కావాల్సిన డీజిల్‌పై సబ్సిడీకి అయ్యే రూ. 29,000/- ఖర్చు ప్రభుత్వ ఖజానాయే భరిస్తుంది. ఎస్.యూ.వీ.లు అనే ఈ ఘరానా కార్లు అమ్ముడయ్యే మొత్తం కార్లలో తక్కువే ఉంటాయి. వాటిని సంపన్నులే కొనగలుగుతారు. పెట్రోల్ కార్లలో తిరిగే మనలాంటి వాళ్లం కూడా మాల్స్‌లో ఏ.సి. సదుపాయం అనుభిస్తాం. అవి నడపడానికి అవసరమయ్యే డీజిల్‌పై కూడా సబ్సిడీ ఉంటుంది. 'రైతుల పేరున డీజిల్ కోసం అందించే సబ్సిడీ డీజిల్ కార్లు ఉన్న వారికి ఉపయోగపడుతోంది. డీజిల్ జనరెటర్లు నడిపే వారూ ఈ సబ్సిడీని అనుభవిస్తుంటారు. నిజానికి వారు సబ్సిడీకి అర్హులు కారు." అని ఇంటిగ్రెటెడ్ రిసెర్చ్ అండ్ ఆక్షన్ ఫర్ డెవలప్‌మెంట్ నిర్వహించిన సర్వేలో తెలిసింది. సంవత్సరానికి ఆరు వంటగ్యాస్ సిలిండర్లే సరఫరా చేయాలని ప్రభుత్వం ఆలోచించినప్పుడు ఎంత గగ్గోలు పుట్టిందో చూడండి.

**బంగారం - నగలు**

నేనైతే నగలు, విలువైన రాళ్ల గురించి ఎక్కువ తాపత్రయ పడను కానీ సబ్సిడీ సంస్కృతి దీన్ని కచ్చితంగా పట్టించుకుంటుంది. అమర్త్యసేన్, జాన్ డ్రీజ్ వీటిని అంతర్గత సబ్సిడీలు అంటారు. బంగారం, వజ్రాలపై సబ్సిడీల వల్ల ప్రభుత్వ ఖజానా రూ. 66,000 కోట్లు కోల్పోతోంది. అంటే ప్రభుత్వ ఆధాయంలో 20% నష్టపోతోంది. ఈ సబ్సిడీ వస్తువులన్నింటిపై లెక్క వేస్తే ముడి చమురు, ఖనిజ తైలాల మీద కంటే ఎక్కువ. అంటే కరెంట్ అకౌంట్ ఖాతాలో లోటు పెరిగినా పరవాలేదు కాని మనకు బంగారంపై మాత్రం సబ్సిడీ ఉండాల్సిందే. ఆహారం మీద మాత్రం సబ్సిడీ అక్కర్లేదన్న మాట.

### పన్నులు

పన్నులు చెల్లించే వాళ్లందరికీ 80సి సెక్షన్ గురించి తెలుసు. మ్యూచువల్ ఫండ్స్, బీమా పాలసీల్లో పెట్టుబడి పెడితే మనకు ఈ సెక్షన్ కింద ఆదాయం పన్నులో రాయితీ వస్తుంది. ఈ ఖాతా కింద కోల్పోయే ప్రభుత్వ ఆదాయం రూ. 30,000 కోట్లు. దీనికి ఆరోగ్య బీమా, ఉన్నత విద్య కోసం తీసుకునే రుణాలపై వడ్డీ మీద సబ్సిడీ లాంటివి కలిపితే ఈ మొత్తం రూ. 37,000 కోట్లకు చేరుతుంది. అంటే ఏడాదికి రూ. 20 లక్షలు సంపాదించేవారికి సబ్సిడీ ఉంటుంది కానీ రోజుకు రెండు డాలర్లు కూడా సంపాదించని వారికి సబ్సిడీ ఉండకూడదన్న మాట.

### విద్యుత్తు

విద్యుత్ కొరత గురించి గునుస్తుంటాం కదా! వినియోగదార్లుగా దీనికి మనమే బాధ్యులం. కిందటిసారి విద్యుత్ చార్జీలు పెంచాలనుకున్నప్పుడు న్యూ ఢిల్లీ నగరం నిర్ఘాంతపోయింది. విద్యుత్ బిల్లులు ఎలా పెరుగుతాయి? "రాష్ట్రాల విద్యుత్ బోర్డుల నష్టాలను భర్తీ చేయడానికి రాష్ట్రాల బడ్జెట్‌లో కొంత మొత్తం కేటాయిస్తారు. ఇది రాష్ట్రాల స్థూల ద్రవ్యలోటులో 10 శాతం ఉంటోంది." అని ప్రణబ్ బర్ధన్ 'అవేకనింగ్ జైంట్స్'లో రాశారు. పెద్ద వ్యవసాయ క్షేత్రాలకు విద్యుత్‌ను మళ్ళించినందువల్ల వారు దేశంలో విద్యుత్ కొరతను ఖాతరు చేయకుండా తమ సబ్సిడీలను కాపాడుకుంటారు. ఉదాహరణకు– గత నెలలో రాజస్థాన్ ప్రభుత్వం విద్యుత్ కంపెనీలకు రూ. 5,774 కోట్ల సబ్సిడీ ఇచ్చింది. ఈ కంపెనీలు రైతులకు తక్కువ ధరకు విద్యుత్ అందజేస్తారని ఈ సదుపాయం కల్పించారు. తమిళనాడులో విద్యుత్ సబ్సిడీలు రూ. 5,200 కోట్లు. కిందటేడాది కన్నా రూ. 1000 కోట్లు ఎక్కువ. బడ్జెట్ కేటాయింపుల్లో ఇదే అన్నింటికన్న అధికం. మనం గ్యాస్ ధరల పెంపు గురించి మాట్లాడుకుంటూ ఈ ధరను ఒక్కో యూనిట్‌కు 8.4 డాలర్లు పెంచినప్పుడు విద్యుత్ కేంద్రాలకు ఈ పెరుగుదల ఉండదని ప్రభుత్వం సూచనప్రాయంగా చెప్పింది. ఇది సబ్సిడీ కాకపోతే మరేమిటి?

### రసాయనిక ఎరువులు

పేద రైతులకు ఎరువుల సబ్సిడీ పేర ప్రభుత్వ ఖజానా రూ. 70,000 కోట్లు నష్టపోవాల్సి వస్తోంది. ఇది జీ.డీ.పీ.లో 0.8 శాతం. ఈ డబ్బులో ఎక్కువ భాగం ఎరువుల కంపెనీలకే, సంపన్న రైతులకే వెళుతుంది. రైతులకు ఇచ్చే సబ్సిడీ నేరుగా రైతులకే అందజేసి వారికి కావాల్సిన ఎరువులు వాళ్లనే కొనుక్కోమనండి అని చూడండి. ఎరువుల కంపెనీలు నానా యాగి చేస్తాయి. ఈ సబ్సిడీ మాత్రమే కాకుండా ప్రభుత్వ ఆదాయంలో మరో రూ. 8,000 కోట్లు కోల్పోవాల్సి వస్తోంది. విద్యుత్‌లాగే ఎరువుల కంపెనీల వారికి గ్యాస్ కూడా సబ్సిడీ ధరకే అందుతుంది. ఇక్కడ సబ్సిడీ పేద రైతులకు ఇస్తున్నట్టా లేక సంపన్న పెట్టుబడిదార్లకు అందుతున్నట్టా?

### కనిపించనివి

మనం అనుభవిస్తున్న ఇతర సబ్సిడీలూ ఉన్నాయి. మనం డిగ్రీలు, డాక్టరేట్లు సంపాదించడానికి మనలో ఎంత మందిమి మార్కెట్ రేట్ ప్రకారం డబ్బు చెల్లించాం కనక? ఇప్పుడు కూడా చాలా ఆదరణ ఉన్న ఢిల్లీ యూనివర్సిటీలో నాలుగేళ్ల డిగ్రీ కోసం రూ. లక్ష ఖర్చవుతుంది. ఈ సబ్సిడీని అనుభవించే వారిలో చాలామంది ఒక మంచి పాఠశాలలో చదువుకోవాలంటే సంవత్సరానికి అంతకన్నా రెట్టింపు ఖర్చు పెట్టాల్సిందే. అలాంటి చోట ప్రవేశం సంపాదించడానికి 99% మార్కులు గనక రాకపోతే విదేశాలకు వెళితే డిగ్రీ సంపాదించడానికి రూ. కోటి వదిలించుకోవాల్సిందే. తద్వారా ప్రభుత్వం రూ. 316 కోట్ల ఆదాయం కోల్పోవాల్సి వస్తుంది (సెక్షన్ 80ఇ కింద ఉన్నత విద్యకు రుణంపై రాయితీ కోసం). నేను చదువుకుంటున్నప్పుడు ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఎక్కడ పడితే అక్కడ తిరగడానికి వీలైన బస్‌పాస్ రూ. 12.50 ఇచ్చేది. అది వినియోగించుకున్నందుకు నాకు ఇప్పుడు తప్పు చేసినట్టు అనిపిస్తుంది. ఆహార సబ్సిడీకి ఎంత ఖర్చు అవుతుందన్న అంశంపై ఇంకా వాదోపవాదాలు సాగుతూనే ఉన్నాయి కానీ, దీని కోసం రూ. 1,12,000 కోట్లు ఖర్చవుతుందని పార్లమెంటరీ స్థాయీ సంఘం అంచనా. దీనిలో రూ. 90,000 కోట్లు ఇప్పటికే భరిస్తున్నారు. అదనంగా భరించాల్సిన రూ. 22,000 కోట్ల పైనే ఈ రాద్ధాంతం అంతా.

ఇప్పుడు సబ్సిడీలన్నింటినీ లెక్క వేసి దేనికి ఎంత అవుతోందో చూడండి. ఈ లెక్కలు గమనిస్తే అమర్త్యసేన్ ఈ పథకాన్ని ఎందుకు సమర్థిస్తున్నారో అర్థం అవుతుంది. ఈ లెక్కలన్నీ చూసి ప్రభుత్వం మొదట సబ్సిడీ దేనికి ఇవ్వాలో తేలిస్తే పేదలకు అన్నం పెట్టడానికే ప్రథమ ప్రాధాన్యం ఉండాలా లేక సంపన్నులకు బంగారానికా తేలుతుంది. అప్పుడు ఆహార సబ్సిడీపై విమర్శలు తగ్గుతాయి. సబ్సిడీలు లేకుండా ఉండాలనడం గొప్ప ఆదర్శమే. కానీ అవి ఉండాల్సిన పరిస్థితే ఉంటే బంగారం కన్నా, పెట్టుబడుల కన్నా, విద్యుత్ కన్నా ఆహారమే ఎక్కువ ప్రధానమైందని గుర్తిస్తాం. అందువల్ల సబ్సిడీలపై దురాశపరులు చేసే సిద్ధాంత రాద్ధాంతాలకు తెర పడుతుంది. ■

# చట్టసభలలో దోషులను రక్షించే ఆర్డినెన్స్‌ను తిరస్కరించండి

## రాష్ట్రపతికి జేపీ లేఖ

నేరం రుజువై శిక్ష పడ్డ చట్టసభ సభ్యులు పై కోర్టులో అప్పీలు తేలేంతవరకూ సభ్యత్వానికి అనర్హులు కాకుండా మినహాయింపునిచ్చే ఆర్డినెన్స్‌ని నిరోధించాలని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి విజ్ఞప్తి చేశారు.

**ఈ మేరకు రాష్ట్రపతికి జేపీ లేఖ రాస్తూ,** "సాటిలేని అనుభవం, అవగాహన ఉన్న ఈ దేశపు రాజనీతిజ్ఞునిగా మన ప్రజాస్వామ్య వ్యవస్థల్ని, పార్లమెంటు, శాసనసభల గౌరవాన్ని, చట్టబద్ధ పాలనను కాపాడేందుకు మీరు అత్యంత అర్హులు. గణతంత్ర అధ్యక్షునిగా, రాజ్యాంగ పరిరక్షకునిగా, జాతి అంతరాత్మ పరిరక్షకునిగా జోక్యం చేసుకుని ప్రతిపాదిత ఆర్డినెన్స్‌ను నిరోధించే నైతిక స్థాయి, రాజ్యాంగ అధికారం మీకున్నాయి" అని పేర్కొన్నారు.

ఈ ఆర్డినెన్స్ పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం, నైతిక తప్పిదం, మన ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే అవకాశవాద చర్య అని జేపీ అన్నారు.

ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 8 (4) సెక్షన్ రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని ఆర్డినెన్స్ తొలగిస్తుంది.

"101 (3) (ఎ), 190 (3) (ఎ) రాజ్యాంగ నిబంధనల్ని, సుప్రీంకోర్టు తీర్పుని జాగ్రత్తగా పరిశీలిస్తే – ఎన్నికవ్వాలనుకుంటున్న వ్యక్తికి ఎలాంటి అనర్హతలు వర్తిస్తాయో చట్టసభ సభ్యునిగా కొనసాగుతున్న వ్యక్తికి కూడా అవే అనర్హతలు యథాతథంగా వర్తిస్తాయని నిర్ద్వంద్వంగా స్పష్టమవుతుంది" అని జేపీ లేఖలో పేర్కొన్నారు.

చట్టం ముందు అందరూ సమానమే అని గ్యారంటీ ఇచ్చే రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ని కూడా ప్రతిపాదిత ఆర్డినెన్స్ ఉల్లంఘిస్తుందన్నారు.

ఈ పరిస్థితులలో, ఎన్నికలలో పోటీచేసే ఏ వ్యక్తికయినా వర్తించే అనర్హత నుంచి ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని 8 సెక్షన్ ప్రకారం నేరం రుజువై శిక్షపడిన చట్టసభసభ్యులకు మినహాయింపునివ్వాలని చెప్పే ఆర్డినెన్స్‌ని రాష్ట్రపతి ఆమోదానికి కేంద్ర కేబినెట్ పంపటం తీవ్ర తప్పిదమని జేపీ స్పష్టంచేశారు.

"ఈ ఆర్డినెన్స్‌ని సుప్రీంకోర్టు కొట్టివేసి తీరుతుంది. ప్రతిపాదిత ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధమేకాకుండా, నైతిక, ప్రజాస్వామ్య వ్యతిరేకం కూడా. తీవ్రస్థాయి నేరానికి శిక్షపడిన వ్యక్తి చట్టసభలో సభ్యునిగా కొనసాగుతూ చట్టాలు చేయటమనేది పూర్తి అర్థరహితం. ఇటువంటి పచ్చి అవకాశవాదం – ప్రజలలో రాజ్యాంగబద్ధత, చట్టబద్ధ పాలన, మన ప్రజాస్వామిక వ్యవస్థల పట్ల హరించుకుపోతున్న విశ్వాసాన్ని మరింత దెబ్బతీస్తుంది. ఈ కష్టసమయంలో రాజ్యాంగ రక్షణకు ముందుకు రావాలంటూ యావత్ దేశం మీ వైపు చూస్తోంది" అని జేపీ అన్నారు.

అటువంటి చట్టం రాజ్యాంగవిరుద్ధమని సుప్రీంకోర్టు ఇప్పటికే తీర్పునిచ్చి ప్రభుత్వ రివ్యూ పిటిషన్‌ని కూడా తోసిపుచ్చింది కాబట్టి, ఆర్టికల్ 123తో పాటు 74, 111 ప్రకరణాల కింద అధికారాల్ని వినియోగించి పునస్సమీక్షకు ఆ ఆర్డినెన్స్‌ని మంత్రివర్గానికి తిప్పిపంపాలని రాష్ట్రపతిని జేపీ కోరారు.

మంత్రివర్గం మళ్లీ ఆర్డినెన్స్‌ని ఆమోదానికి పంపితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 143కింద సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని రాష్ట్రపతి కోరాలని జేపీ విజ్ఞప్తి చేశారు. ఆర్టికల్ 143 ప్రకారం, 'సుప్రీంకోర్టు అభిప్రాయం తీసుకోవాల్సిన స్థాయి స్వభావం,

ప్రజాప్రయోజన ప్రాముఖ్యత కలిగిన అంశంపై చట్టానికి లేదా వాస్తవానికి సంబంధించి రాష్ట్రపతికి ఏదైనా సందేహం వస్తే, వచ్చే అవకాశముంటే, ఆ సందేహాన్ని కోర్టు పరిశీలనకు పంపవచ్చు.

**రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి డా॥ జయప్రకాష్ నారాయణ్ రాసిన లేఖ స్థూల పాఠం :**

గౌరవనీయులైన రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ ముఖర్జీ గార్కి,

1. నేరం రుజువై శిక్ష పడిన చట్టసభ సభ్యులు పై కోర్టులో చేసుకున్న అప్పీలు తేలేంతవరకూ సభ్యత్వానికి అనర్హులు కాకుండా మినహాయింపునిచ్చేలా ఆర్డినెన్స్‌కి సిఫార్సు చేయాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించినట్టు సమాచారం. ఈ ఆర్డినెన్స్ పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం, నైతిక తప్పిదం, మన ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే అవకాశవాద చర్య.

2. 2005లో దాఖలైన 490, 231 రిట్ పిటిషన్లకు సంబంధించి జులై 10న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు "ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 8 (4) సెక్షన్‌ని పెట్టే అధికారం పార్లమెంటుకు లేదు. చట్టంలోని 8(4) సెక్షన్ పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం'' (పేరా 22) అని నిర్ద్వంద్వంగా పేర్కొంది. ఈ తీర్పులో రాజ్యాంగంలోని 102 (1) (ఇ), 191 (1) (ఇ) ప్రకరణాల్లోని పదాలు, లక్ష్యాల మీద కోర్టు ఆధారపడింది. పేరా 20లో కోర్టు ఇలా పేర్కొంది: "రాజ్యాంగంలోని 102 (1) (ఇ), 191 (1) (ఇ) ప్రకరణాలలో వక్కాణింపునిచ్చిన పదాల ప్రాతిపదికన, పార్లమెంటు సభ్యునిగా, లేదా ఒక రాష్ట్ర శాసనసభ్యునిగా ఎన్నికకానున్న వ్యక్తికి – పార్లమెంటులో లేదా ఒక రాష్ట్ర అసెంబ్లీలో సభ్యునిగా కొనసాగుతున్న వ్యక్తికి ఒకే తరహా అనర్హతల్ని వర్తింపచేసే చట్టాన్ని చేసే అధికారాలు పార్లమెంటుకు ఉన్నాయి". కోర్టు ఇంకా ఇలా చెప్పింది: "పదవిలో కొనసాగుతున్న పార్లమెంటు సభ్యునికి, లేదా రాష్ట్ర శాసనసభ సభ్యునికి అనర్హతను వాయిదా వేసే అధికారం పార్లమెంటుకు లేకుండా రాజ్యాంగంలోని 101 (3) (ఎ), 190 (3) (ఎ) ప్రకరణాలు స్పష్టంగా నిషేధించాయి. కాబట్టి, చట్టంలోని 8 (4) సెక్షన్‌ని అమలుచేయటం ద్వారా రాజ్యాంగం తనకు ఇచ్చిన అధికారాల్ని పార్లమెంటు ఉల్లంఘించింది. చట్టంలోని 8 (4) సెక్షన్ రాజ్యాంగ విరుద్ధం".

3. 102 (1) (ఇ) ఈ విధంగా పేర్కొంటుంది: "ఒక వ్యక్తి ఎన్నికవటానికి అనర్హునిగా, పార్లమెంటులోని ఉభయ సభలలో సభ్యునిగా ఉండటానికి అనర్హునిగా ఉన్నట్టే..................... ఇ) పార్లమెంటు చేసిన ఏ చట్టం ద్వారానైనా లేదా చట్టం కింద అతను అలా అనర్హుడైనట్టయితే

   101 (3) (ఎ) ఇలా పేర్కొంటుంది: "పార్లమెంటులోని ఉభయ సభలలో దేంట్లో సభ్యుడైనా, 102 ప్రకరణం క్లాజ్ (1) లేదా క్లాజ్ (2)లో పేర్కొన్న అనర్హతల పరిధిలోకి వస్తే, అతని సభ్యత్వం తక్షణం ఖాళీ అవుతుంది."

   రాజ్యాంగంలోని 191 (1) (ఇ), 190 (3) (ఎ) ప్రకరణాల్లో రాష్ట్ర శాసనసభలకు కూడా ఇదేతరహా నిబంధనలు ఉన్నాయి.

4. ఈ రాజ్యాంగ నిబంధనల్ని, సుప్రీంకోర్టు తీర్పుని జాగ్రత్తగా పరిశీలిస్తే – ఎన్నికవ్వాలనుకుంటున్న వ్యక్తికి ఎలాంటి అనర్హతలు వర్తిస్తాయో చట్టసభ సభ్యునిగా కొనసాగుతున్న వ్యక్తికి కూడా అవే అనర్హతలు యధాతథంగా వర్తిస్తాయని నిర్ద్వంద్వంగా స్పష్టమవుతుంది. 32, 141, 142 ప్రకరణాల కింద ఒక చట్టాన్ని లేదా ప్రభుత్వ నిర్ణయాన్ని న్యాయసమీక్ష చేసే అధికారం, బాధ్యత సుప్రీంకోర్టుకు ఉందనేది అందరూ గుర్తించిన న్యాయసూత్రం.

5. దాంతోపాటు, "భారత భూభాగం పరిధిలో చట్టం ముందు అందరికీ సమానత్వం ఇవ్వకుండా, అన్ని చట్టాలకూ సమాన రక్షణ ఇవ్వకుండా తిరస్కరించే అధికారం

రాజ్యవ్యవస్థకు లేదు" అని రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల అధ్యాయంలోని 14వ ఆర్టికల్ విస్పష్టంగా గ్యారంటీ ఇస్తుంది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని 8 (4) సెక్షన్ లేదా దానికి ప్రత్యామ్నాయంగా రాష్ట్రపతి ఆమోదం కోసం పంపుతున్నారని చెబుతున్న ఆర్డినెన్స్ చాలా స్పష్టంగా 190, 191, 101, 102 ఆర్టికల్స్‌తోపాటు ఆర్టికల్ 14ని కూడా ఉల్లంఘిస్తుంది.

6. ఈ పరిస్థితులలో, ఎన్నికలలో పోటీచేసే ఏ వ్యక్తికయినా వర్తించే అనర్హత నుంచి ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని 8 సెక్షన్ ప్రకారం నేరం రుజువై శిక్షపడిన చట్టసభసభ్యులకు మినహాయింపునివ్వాలని చెప్పే ఆర్డినెన్స్‌ని రాష్ట్రపతి ఆమోదానికి కేంద్ర కేబినెట్ పంపటం తీవ్ర తప్పిదం. ఈ ఆర్డినెన్స్‌ని సుప్రీంకోర్టు కొట్టివేసి తీరుతుంది. ప్రతిపాదిత ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధమేకాకుండా, నైతిక, ప్రజాస్వామ్య వ్యతిరేకం కూడా. తీవ్రస్థాయి నేరానికి శిక్షపడిన వ్యక్తి చట్టసభలో సభ్యునిగా కొనసాగుతూ చట్టాలు చేయటమనేది పూర్తి అర్థరహితం. ఇటువంటి పచ్చి అవకాశవాదం - ప్రజలలో రాజ్యాంగబద్ధత, చట్టబద్ధ పాలన, మన ప్రజాస్వామిక వ్యవస్థల పట్ల హరించుకుపోతున్న విశ్వాసాన్ని మరింత దెబ్బతీస్తుంది. ఈ కష్టసమయంలో రాజ్యాంగ రక్షణకు ముందుకు రావాలంటూ యావత్ దేశం మీ వైపు చూస్తోంది.

7. సాటిలేని అనుభవం, అవగాహన ఉన్న ఈ దేశపు రాజనీతిజ్ఞునిగా మన ప్రజాస్వామ్య వ్యవస్థల్ని, పార్లమెంటు, శాసనసభల గౌరవాన్ని, చట్టబద్ధ పాలనను కాపాడేందుకు మీరు అత్యంత అర్హులు. గణతంత్ర అధ్యక్షునిగా, రాజ్యాంగ పరిరక్షకునిగా, జాతి అంతరాత్మ పరిరక్షకునిగా జోక్యం చేసుకుని ప్రతిపాదిత ఆర్డినెన్స్‌ను నిరోధించే నైతిక స్థాయి, రాజ్యాంగ అధికారం మీకున్నాయి.

8. కాబట్టి, ఆర్టికల్ 123తో పాటు 74, 111 ప్రకరణాల కింద మీ అధికారాల్ని వినియోగించి పునస్సమీక్షకు ఆ ఆర్డినెన్స్‌ని మంత్రివర్గానికి తిప్పిపంపవలసిందిగా కోరుతున్నాను. అటువంటి చట్టం రాజ్యాంగవిరుద్ధమని సుప్రీంకోర్టు ఇప్పటికే తీర్పునిచ్చి ప్రభుత్వ రివ్యూ పిటిషన్‌ని కూడా తోసిపుచ్చింది కాబట్టి, ఆర్టికల్ 143 కింద ఈ అంశాన్ని రాష్ట్రపతి రిఫరెన్స్ కింద సుప్రీంకోర్టుకు పంపవచ్చు. ఆర్టికల్ 143 ప్రకారం, 'సుప్రీంకోర్టు అభిప్రాయం తీసుకోవాల్సిన స్థాయి స్వభావం, ప్రజాప్రయోజన ప్రాముఖ్యత కలిగిన అంశంపై చట్టానికి లేదా వాస్తవానికి సంబంధించి రాష్ట్రపతికి ఏదైనా సందేహం వస్తే, వచ్చే అవకాశముంటే, ఆ సందేహాన్ని కోర్టు పరిశీలనకు పంపవచ్చు. వివరాలను విన్నాక, అటువంటి పరిశీలనకు అర్హమైనదని కోర్టు భావిస్తే, తన అభిప్రాయాన్ని రాష్ట్రపతికి నివేదించవచ్చు." ఇది స్పష్టంగా విస్తృత ప్రజాప్రయోజనంతో ముడిపడిన కీలకాంశం. రాజ్యాంగ నిబద్ధతకు సంబంధించిన మౌలిక ప్రశ్న తలెత్తింది. కాబట్టి, మంత్రివర్గం ఆర్డినెన్స్‌ని పునరామోదం కోసం మీ వద్దకు పంపితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 143 కింద మీరు సుప్రీంకోర్టుకు రిఫర్ చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

9. గౌరవనీయులైన రాష్ట్రపతీజీ, మీ మార్గదర్శనం కోసం, విజ్ఞత గల సలహా కోసం ఈ దేశం ఇప్పుడు మీ వైపు చూస్తోంది. రాజ్యాంగం పరిధిలో పరిపాలించటం మాత్రమే ఎన్నికైన ప్రభుత్వ బాధ్యత తప్ప రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య నిబంధనల్ని అణగదొక్కే అధికారాన్ని చేతుల్లోకి తీసుకోలేదు. రాజ్యాంగాన్ని, ప్రజానైతికతను, ప్రజాస్వామ్య సంస్థలను పరిరక్షించి దేశ సమగ్ర ప్రయోజనాలను కాపాడేందుకు ఈ అంశంలో మీరు నిక్కచ్చిగా, నిర్ద్వంద్వంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ■

# పరిణత నాయకత్వం లేకే సంక్షోభాలు : జేపీ

## లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో ఘనంగా హైదరాబాద్ విమోచన దినోత్సవం

ఎక్కడాలేనన్ని జాతులు, మతాలు, భాషలు, తెగలు, ప్రాంతాలు ఉన్నప్పటికీ కేవలం 15నెలల వ్యవధిలో 562 సంస్థానాలను దాదాపు రక్తపాతం లేకుండా, శాంతియుతంగా సర్దార్ పటేల్, నెహ్రూ వంటి నేతలు ఆనాడు భారతదేశంలో విలీనం చేస్తే, ఈరోజు పాలకులు ఒక భాష మాట్లాడేవారికి సంబంధించిన చిన్న సమస్యను పరిష్కరించే నాయకత్వ లక్షణాల్ని కూడా ప్రదర్శించలేకపోతున్నారని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. శ్రీలంకలో, కెనడాలో, బెల్జియంలో కేవలం రెండు, మూడు భాషల ప్రజల మధ్య నిరంతరం ఘర్షణలు నెలకొని రాజకీయ అనిశ్చితి ఏర్పడుతుంటే, ఆనాడు మన జాతీయోద్యమ నేతలు 22 అధికారిక భాషల మధ్య ఐక్యత సాధించారని, పార్టీలకతీతంగా అందర్నీ ఒప్పించి అలవోకగా భాషాప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటుచేశారని గుర్తుచేశారు. మన సంస్థానాల విలీనంలాంటి అద్భుత ఘటన ప్రపంచంలో ఏ దేశంలోనూ ఇంతవరకూ జరగలేదని, ఇక ముందు జరిగే అవకాశం లేదని, చిట్టచివరన, మూడు భాషలతో అతిపెద్ద స్వతంత్ర సంస్థానంగా ఉన్న హైదరాబాద్ భారతదేశంలో విలీనమైన సెప్టెంబర్ 17 (1948)ను జాతి సమైక్యతా దినోత్సవంగా తొలినుంచీ లోక్‌సత్తా పార్టీ పాటిస్తోందని అన్నారు.

**హైదరాబాద్ భారత్‌లో విలీనమైన రోజును పురస్కరించుకుని లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో జయప్రకాష్ నారాయణ్ జాతీయజెండాను ఎగరవేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ అమరవీరులకు పార్టీ నేతలు జోహార్లర్పించారు.**

**అనంతరం జేపీ మాట్లాడుతూ..** ఆనాడు నేతల్లా జాతి నిర్మాణం కోసం, సామరస్యత కోసం పనిచేయకుండా, ఈవేళ నేతలు ప్రజల మధ్య చిచ్చుపెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందటం కోసం, వారి కుటుంబాల కోసం పనిచేస్తుండటం వల్లే చిన్న సమస్యలు కూడా సంక్షోభాలుగామారి పరిష్కారం జటిలమవుతోందన్నారు. ఆనాడు దేశంలో ఆహార కొరత ఏర్పడినప్పుడు, ఆహారం అందుబాటులో ఉన్నవారు వారానికి ఒక రోజు పస్తులుండి లేనివారికి సాయం చేయాలని అప్పటి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి పిలుపునిచ్చి దేశ ప్రజలను కదలించారని, కానీ 80 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యం కొరతను ఎదుర్కొంటున్న ఈరోజున బంగారం దిగుమతులను ఆపి ఆ కొరతను అదుపుచేసేందుకుగాను బంగారం కొనవద్దని ప్రజల్ని ప్రేరేపించే శక్తి నాయకత్వానికి కొరవడిందన్నారు. విదేశాల నుంచి ఓడలు వస్తేనే తిండి తినే పరిస్థితిని అధిగమించి ఈవేళ మన గోదాముల్లో 8 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు మూలుగుతున్నా, వాటిని ఎగుమతి చేసి, మనం దిగుమతి చేసుకునే పామాయిల్ వంటి వాటి మీద సుంకం విధించి. మన రైతుల్ని, గ్రామాల్ని, దేశ ఆర్థికవ్యవస్థను బాగుచేద్దామన్న సంకల్పం ఏకోశానా పాలకుల్లో కనిపించటం లేదన్నారు.

సర్దార్ పటేల్, డా॥ అంబేద్కర్, నెహ్రూ, ఆజాద్ వంటి ఆనాటి నేతల నుంచి జాతీయదృక్పథం, సేవానిరతి, అంకితభావం అలవర్చుకోవటానికి స్ఫూర్తిని పొందకుండా కేవలం మొక్కుబడి వేడుకలుగా ఆగస్టు 15, సెప్టెంబర్ 17 వంటి రోజుల్ని జరుపుకుంటే ఈవేళ్టి మన సమస్యలకు పరిష్కారం రాదని జేపీ స్పష్టంచేశారు. వేగంగా ఎదిగే అవకాశాలు ఇంకా భారతదేశానికి మిగిలేఉన్నాయని, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేస్తూ సామరస్యంగా సమస్యల్ని పరిష్కరిస్తూ దేశ ఆర్థికాభివృద్ధిని సాధించగల, తమ పిల్లల భవిష్యత్తు కోసం కొంతమేరైనా త్యాగాలకు సిద్ధపడేలా ప్రజల్ని ప్రేరేపించగల నాయకత్వం ఇప్పుడు కావాలన్నారు. సంక్షోభంలో ఉన్న తెలుగువారందరికీ సామరస్య పరిష్కారాన్నందించే స్ఫూర్తిని సెప్టెంబర్ 17 అందించాలని ఆకాంక్షిస్తూ, హైదరాబాద్ విమోచనం, దేశ సమైక్యతాదినం సందర్భంగా రాష్ట్ర, దేశ ప్రజలకు జయప్రకాష్ నారాయణ్ శుభాకాంక్షలు అందించారు.

లోక్‌సత్తా పార్టీ నేతలు డి.వి.వి.ఎస్ వర్మ, బండారు రామ్మోహనరావు, ఈద చెన్నయ్య, ఎన్. సరోజాదేవి, కె. గీతామూర్తి, దోసపాటి రాము తదితరులు పాల్గొన్నారు. ■

# ఐటిఐఆర్ ప్రాజెక్టుల్ని వికేంద్రీకరించండి: జేపీ

హైదరాబాద్‌కి ఐ.టి పెట్టుబడుల ప్రాంతం (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ – ఐటిఐఆర్) కేటాయింపును స్వాగతిస్తున్నామని, అదేసమయంలో పెట్టుబడులన్నిటినీ హైదరాబాద్‌లోనే కేంద్రీకరించి పాత తప్పిదాన్నే మళ్లీ చేయవద్దని లోక్‌సత్తా పార్టీ హెచ్చరించింది.

ప్రాంతీయ అసమతుల్యతల్ని, ఆర్థిక అసమానతల్ని, రాజకీయ అనిశ్చితిని దృష్టిలో పెట్టుకుని ఐటిఐఆర్ కింద ప్రతిపాదించిన ప్రాజెక్టుల్ని వికేంద్రీకరించి రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలోని మూడు, నాలుగు ప్రధాన కేంద్రాలలో ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కోరారు.

రూ. 2.19 లక్షల కోట్ల ఐ.టి పెట్టుబడుల ప్రాంతం కేటాయింపుని ఆమోదిస్తూ సెప్టెంబర్ 20న కేంద్ర మంత్రివర్గ ఆర్థిక వ్యవహారాల సంఘం తీసుకున్న నిర్ణయం – రాజకీయ అనిశ్చితి వల్ల గత కొన్నేళ్లుగా నష్టపోతున్న ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు మంచి ఊతమిస్తుందని జేపీ పేర్కొన్నారు.

అయితే, గతంలో రెండు జాతీయ పెట్టుబడి, ఉత్పత్తి జోన్‌లను, ఒక పెట్రోలియం, పెట్రో కెమికల్స్ పెట్టుబడి రీజియన్‌ను ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించినా ఇంతవరకూ వాటి అతీగతీ లేదని జేపీ గుర్తుచేశారు. కళ్లు చెదిరే పెట్టుబడులతో చేస్తున్న ఆర్భాటపు ప్రతిపాదనలు ప్రకటనలకే పరిమిత మవుతున్నాయి తప్ప రాష్ట్రంలోయువ నిరుద్యోగుల ఆశల్ని నెరవేర్చటం లేదన్నారు.

ఏటా రాష్ట్రంలో 12 లక్షలమంది విద్యార్థులు కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి పట్టభద్రులవుతున్నారని జేపీ అన్నారు. వీరందరికీ సరైన జీవితాన్ని అందించాలంటే, ఉత్పత్తిరంగాన్ని పెంచి ఉద్యోగాలు సృష్టించేందుకు భారీ కార్యక్రమం అవసరమన్నారు. ఇందుకోసం ఒక సమగ్ర వ్యూహాన్ని రూపొందించి వెంటనే అమలులోకి తేవాలన్నారు.

రాజకీయ స్థిరత్వం, దూరదృష్టి గల నాయకత్వం ఉంటేనే ఉద్యోగాల సృష్టి, పెట్టుబడులు సాధ్యమవుతాయని జేపీ అన్నారు. ఎడతెగని రాజకీయ అనిశ్చితి, శాంతిభద్రతల సమస్యలు, ఏ రంగంలో చూసినా విపరీతమైన అవినీతి, మౌలికవసతులు, ముఖ్యంగా విద్యుత్ రంగం అధ్వాన్నమవటం – పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనకు తీవ్ర అవరోధంగా మారాయన్నారు. మన రాష్ట్రం, దేశం యుద్ధప్రాతిపదికన ఈ సమస్యల్ని అధిగమించాల్సుందని జయప్రకాష్ నారాయణ్ ఒక ప్రకటనలో అన్నారు. ■


ఐటీ సంస్థలకు నెలవైన మాదాపూర్ ప్రాంతం

# కేంద్ర నిధుల పంపిణీకి కొత్త పద్ధతి

**- రఘురాం రాజన్ కమిటీ సిఫారసు**

- కేంద్ర నిధులకు రాజన్ కమిటీ కొత్త పద్ధతి
- అభివృద్ధిలో గోవా, కేరళకు అగ్రస్థానం
- వెనకబడ్డ జాబితాలో ఆంధ్రప్రదేశ్

కేంద్రం నుంచి అదనపు నిధులు పొందటానికి ఉద్దేశించిన ప్రత్యేక రాష్ట్ర హోదాకు కేంద్ర ప్రభుత్వం చెల్లుచీటీ పలకబోతోంది. దాని స్థానంలో నితీశ్‌కుమార్, నవీన్ పట్నాయక్ లాంటి వారిని ఎన్నికల ముందు సంతృప్తి పర్చటానికేనా అన్నట్లు - బీద రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కల్పించి కేంద్ర అదనపు సాయం అందించే ప్రాథమిక అభివృద్ధి సిద్ధాంతాన్నే కేంద్ర ప్రభుత్వం మార్చేస్తోంది. పూర్వ ముఖ్య ఆర్థిక సలహాదారు (ప్రస్తుత ఆర్.బి.ఐ. గవర్నర్) రఘురామ్ రాజన్ సారథ్యంలోని కమిటీ- రాష్ట్రాల్లో అభివృద్ధి కోసం కేంద్ర నిధులు కేటాయించటానికి సరికొత్త పద్ధతిని సూచించింది. బహుముఖ గణాంకం (మల్టీ డైమెన్షనల్ ఇండెక్స్-ఎం.డి.ఐ.) ఆధారంగా దీన్ని సూత్రీకరించారు. బీహార్ తదితర రాష్ట్రాల నుంచి ప్రత్యేక హోదా కావాలంటూ డిమాండ్లు వచ్చిన నేపథ్యంలో గతంలో ప్రభుత్వం ఈ కమిటీని నియమించింది. వెనకబడిన రాష్ట్రాలను గుర్తించే పద్ధతితోపాటు, మునుముందు వీటికి కేంద్రం నుంచి నిధులు కేటాయించటానికి మార్గదర్శకాలు సూచించాల్సిందిగా కేంద్రం ఈ కమిటీని కోరింది.

జాతీయ నమూనా సర్వే (ఎన్ఎస్ఎస్ఒ) లెక్కించే తలసరి వినియోగం, పేదరిక నిష్పత్తిలతో పాటు పన్నెండో ప్రణాళికలో పేదరికాన్ని నిర్వచించేందుకు అనుసరించిన ఇతర ప్రాతిపదికల ఆధారంగా వెనకబాటుతనం ఎం.డి.ఐ.ని ఈ కమిటీ రూపొందించింది. దీని ఆధారంగా 28 రాష్ట్రాలనూ మూడు కేటగిరీలుగా విభజిస్తారని కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం వెల్లడించారు. అవి - 1. అత్యంత వెనకబడినవి 2. అభివృద్ధిలో వెనకబడినవి 3. ప్రగతి పథంలో ఉన్నవి (ఫర్వాలేదనిపించేలా అభివృద్ధి చెందినవి). ఎం.డి.ఐ. సూచీపై

| | State | Under Development / Need Index |
|---|---|---|
| **అత్యంత వెనకబడిన రాష్ట్రాలు (LEAST DEVELOPED)** | | |
| 1. | ఒడిస్సా | 0.798 |
| 2. | బీహార్ | 0.765 |
| 3. | మధ్యప్రదేశ్ | 0.759 |
| 4. | చత్తీస్‌గఢ్ | 0.752 |
| 5. | జార్ఖండ్ | 0.746 |
| 6. | అరుణాచల్ ప్రదేశ్ | 0.729 |
| 7. | అస్సాం | 0.707 |
| 8. | మేఘాలయ | 0.693 |
| 9. | ఉత్తరప్రదేశ్ | 0.638 |
| 10. | రాజస్థాన్ | 0.626 |
| **అభివృద్ధిలో వెనకబడిన రాష్ట్రాలు (LESS DEVELOPED)** | | |
| 11. | మణిపూర్ | 0.571 |
| 12. | పశ్చిమ బెంగాల్ | 0.551 |
| 13. | నాగాలాండ్ | 0.546 |
| 14. | ఆంధ్రప్రదేశ్ | 0.521 |
| 15. | జమ్మూకాశ్మీర్ | 0.504 |
| 16. | మిజోరాం | 0.495 |
| 17. | గుజరాత్ | 0.491 |
| 18. | త్రిపుర | 0.474 |
| 19. | కర్ణాటక | 0.453 |
| 20. | సిక్కిం | 0.430 |
| 21. | హిమాచల్‌ప్రదేశ్ | 0.404 |
| **ప్రగతి పథంలో ఉన్న రాష్ట్రాలు (RELATIVELY DEVELOPED)** | | |
| 22. | హర్యానా | 0.395 |
| 23. | ఉత్తరాఖండ్ | 0.383 |
| 24. | మహారాష్ట్ర | 0.352 |
| 25. | పంజాబ్ | 0.345 |
| 26. | తమిళనాడు | 0.341 |
| 27. | కేరళ | 0.095 |
| 28. | గోవా | 0.045 |

0.6 లేదా అంతకంటే ఎక్కువ ఉన్న రాష్ట్రాలను అత్యంత వెనకబడిన రాష్ట్రాలుగా, 0.4 కంటే ఎక్కువ 0.6 కంటే తక్కువ ఉన్నవాటిని అభివృద్ధిలో వెనకబడిన రాష్ట్రాలుగా, 0.4 కంటే తక్కువ ఉన్నవాటిని ప్రగతి పథంలో ఉన్న రాష్ట్రాలుగా వర్గీకరించారు.

ఎం.డి.ఐ. సూచీ ప్రకారం పది రాష్ట్రాలు - ఒడిస్సా, బీహార్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లను అత్యంత వెనకబడిన రాష్ట్రాలుగా రాజన్ కమిటీ గుర్తించింది. గోవా, కేరళ, తమిళనాడు, పంజాబ్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, హర్యానాలకు ప్రగతి పథంలో ఉన్న రాష్ట్రాల హోదా ఇచ్చింది. ఇక మణిపూర్, బెంగాల్, నాగాలాండ్, ఆంధ్రప్రదేశ్, జమ్మూకాశ్మీర్, మిజోరాం, గుజరాత్, త్రిపుర, కర్ణాటక, సిక్కిం, హిమాచల్‌ప్రదేశ్‌లను అభివృద్ధిలో వెనకబడిన వాటిగా గుర్తించింది.

రాజన్ కమిటీ ప్రతిపాదించిన ఈ పద్ధతిలో ప్రతి రాష్ట్రానికీ కచ్చితంగా కొంత మొత్తాన్ని కేంద్రం కేటాయిస్తుంది. అదనపు కేటాయింపులనేవి మాత్రం ఆయా రాష్ట్రాల అభివృద్ధి అవసరాలు, అభివృద్ధి చెందుతున్న తీరుపై ఆధారపడి ఉంటాయి. కేంద్రం ఇచ్చే నిధుల్లో 0.3 శాతం ప్రతి రాష్ట్రానికీ కచ్చితంగా కేటాయించటం. గణాంక సూచీలో 0.6 కంటే ఎక్కువ స్కోరున్న వాటిని తక్కువ అభివృద్ధి సాధించినవిగా వర్గీకరించటంలాంటి రెండు ప్రతిపాదనలతో నిధుల కేటాయింపుతోపాటు, రాష్ట్రాల ప్రత్యేక అవసరాలు తీర్చటం సమర్థంగా చేయగలుగుతామని చిదంబరం వ్యాఖ్యానించారు. ■

# జెండా - ఎజెండా

**- యస్.డి.రసూల్, భాయి,** నెల్లూరు

నీలంరంగు జెండరో - నీతిగల్ల జెండరా
నీతిగల్ల జెండరా - లోక్‌సత్తా జెండరా
లోక్‌సత్తా జెండరా - ప్రజలు స్పందించిన గుండెరా ॥నీ॥

అడుగుబడుగు, బలహీనుల - కండగుండె జెండరా
మంచివాళ్ళు కూడిన - జనరాజకీయ దండరా
మేధావుల మార్గదర్శి - చిత్తశుద్ధి మెండురా ॥నీ॥

ప్రజాసంఘాలన్ని చేరి - సాగరంబాయెరా
సాగరం నీలంరంగు - ఎంతో లోతు భావంరా
విశాల దృక్పథానికి - ప్రతీక నీలం రంగురా ॥నీ॥

ప్రజాస్వామ్య వ్యవస్థలో - పంచకోణాలుండురా
స్వాతంత్ర్యం - స్వపాలన అందులోని రెండురా
పౌరునిదే అధికారం - కోణంలో మూడురా ॥నీ॥

నాలుగయిదు కోణాలు - చట్టబద్ధపాలన - స్వయందిద్దుబాటురా
జెండాకు మధ్యలో హుందాగా ఎగురుతున్న
పంచకోణ నక్షత్రం - సుదూర వెలుగుమార్గం రా ॥నీ॥

కులమతాల కతీతంగా తెలుపురంగు వుండురా
భాషలకు ప్రాంతాలకు - గౌరవాన్నిచ్చురా
భిన్నత్వంలో ఏకత్వం - తెలుపు వృత్తం భావంరా॥నీ॥

స్వచ్ఛతకు శాంతికి - సంకేతం తెలుపురా
మచ్చలేని శక్తులకు - తెలుపురంగు గుర్తురా
జెండాలో ఎజెండవుండే - లోక్‌సత్తా జెండరా ॥నీ॥

కొత్తతరం ప్రజలకు - సరికొత్త రాజకీయంరా
స్థానిక ప్రభుత్వాల్ని - చట్టబద్ధం చేయురా
యాభైగ్యారంటీలు - నెర వేర్చే ఒకే జెండరా ॥నీ॥

# జన సాహిత్య సాంస్కృతికోద్యమ కలం యోధుడు

## ఛాయరాజ్‌కు లోక్‌సత్తా నివాళి



కవి ఛాయరాజ్ నాలుగ్గోడలకు పరిమితిమైన వ్యక్తికాదు. నాలుగు దిక్కులకు వ్యాపించిన ఉద్యమ వ్యక్తిత్వం ఆయనది. పేరుకోసం, ప్రతిష్ఠ కోసం, సంపాదన కోసం ఆయనెప్పుడూ రచన చెయ్యలేదు. ప్రజా సాహిత్యోద్యమానికి తన కలాన్ని ఆయుధంగా చేసుకొని పోరాడిన అక్షరయోధుడు ఛాయరాజ్. ఆయన మృతికి లోక్‌సత్తా పార్టీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నది.

## లోతు గుండెలు

**లేని నన్ను గురించిన**
**ఆలోచన నీకెందుకు**
**నీ జ్ఞాపకంలో నా ఆశయాన్ని కొనసాగించేటందుకు**

**కానరాని నా కోసం**
**కలగనడం నీకెందుకు**
**నీ రూపంలో నా ఆకాంక్షను నెరవేర్చేటందుకు**

**నేనెందుకు లేనో**
**ఆ ఆవేదన నీకెందుకు**
**నీకందిన నా హృదయాన్ని పదిమందికి పంచేందుకు**

**లేని నువ్వు నా కోసం**
**విలపించుట నీకెందుకు**
**మన ఉనికిలేమి సారాంశం అందరికీ తెలిపేందుకు**

**ఇద్దరమూ లేనినాడు**
**మనను వెతికె వారెందుకు**
**మిగిలిన శిల్పాన్ని చెక్కి ముందు తరానికందించేందుకు**

(ముందూ వెనుకా "పోతున్నప్పు"డల్లా ఒకరు మరొకరితో మాట్లాడుకుంటున్నారు)

**- ఛాయరాజ్**

# గుంటూరులో భగత్‌సింగ్ 106వ జయంతి

ది. 27-9-2013న లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయంలో స్వర్గీయ భగత్‌సింగ్ 106వ జన్మదినవేడుక ఘనంగా నిర్వహించటం జరిగింది.

ముందుగా యువత భగత్‌సింగ్ ఫొటోకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. నేటి యువతకు ఆదర్శప్రాయుడైన భరతమాత ముద్దుబిడ్డ భగత్‌సింగ్ అని జిల్లా ఉపాధ్యక్షులు జి. వెంకటేశ్వరరావు కొనియాడారు. ఉరికంబం ఎక్కుతూ కూడా దేశంపట్ల అభిమానంతో స్వాతంత్ర్య సాధనపట్ల నిబద్ధతతో "ఇంక్విలాబ్ జిందాబాద్" అంటూ నినదించిన విప్లవ జ్యోతి ఆదర్శాల కోసం యువ పాటుపడాలని జిల్లా సహాయకార్యదర్శి మోదుగుల శ్రీనాథరెడ్డి భావిభారత పౌరులకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో యన్.రవితేజ, సిహెచ్.దుర్గాప్రసాద్,




భరద్వాజ్, యు.వి.సత్యనారాయణ, జి.వెంకటేశ్వరరావు, శ్రీనాధరెడ్డి, జి.సి.వెంకయ్య, బి.ఉమా మహేశ్వరరెడ్డి, యస్.వెంకటేశ్వరరావు, బి.హెచ్.రాజు, డి.వి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సత్తా కృషితో బారికేడ్స్ ఏర్పాటు




నగర లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు బి. అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మరియు స్థానికుల నుండి 80 మంది సంతకాలను సేకరించి ట్రాఫిక్ అధికారులకు వినతిపత్రము అందచేయుటవే కాకుండా అధికారులను సాయిబాబా గుడి జంక్షన్ పాయింట్‌లోకి తీసుకువచ్చి అక్కడ పరిస్థితి తీవ్రతను వివరించారు. వెంటనే అధికారులు స్పందించి అజిత్‌సింగ్‌నగర్ సాయిబాబా గుడి మూడు రోడ్ల జంక్షన్ వద్ద వాహనదారుల యొక్క అతివేగాన్ని నియంత్రించేందుకు బారికేట్లు ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నగర ఉపాధ్యక్షులు బండ్ల మూడి మురళీకృష్ణ, సెక్రటరీ ఉప్పులూరి రవితేజ, నాయకులు పూర్ణా, షేక్ బాబు, షేక్ కాలేషా వలి మరియు స్థానికులు కె. శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ నార్త్‌లో జనచైతన్య యాత్రకు ప్రజాస్పందన



ప్రజల ప్రయోజనాలను కాపాడేది లోక్‌సత్తా పార్టీయేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి భీశెట్టి బాబ్జీ అన్నారు. విభజన పేరుతో రాష్ట్రంలో సంక్షోభం సృష్టించిన కాంగ్రెస్ పార్టీతో పాటుగా ప్రధాన రాజకీయ పార్టీలు అన్ని కూడా కారణమన్నారు. అక్కయ్యపాలెంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల ఓట్ల రాజకీయం గురించి ప్రజలకు తెలియచెప్పేందుకు ఈ నెల 11 నుంచి అక్కయ్యపాలెం మొదలుకొని నగరంలోని అన్నీ ప్రాంతాల్లో లోక్‌సత్తా జనచైతన్య యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. దీనికి ప్రజలు నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఈ యాత్ర ద్వారా కరపత్రాలు పంపిణీ చేస్తూ, పార్టీ అధినేత డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ప్రసంగించిన చిత్రాలను ప్రదర్శిస్తున్నా మన్నారు. పార్టీ తూర్పు నియోజకవర్గం అధ్యక్షుడు గొట్టిపాటి సాంబశివయ్య మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న రాజకీయ పార్టీలను ప్రజలు నమ్మడం లేదని విభజనపై శాశ్వత పరిష్కారం అవసరమని తెలిపిన జేపీని ప్రజలు, యువత అభినందిస్తు న్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం సహాయ కార్యదర్శి చిప్పాడ ఉదయ్, సురేష్ సోమయాజుల, మురారీ జగన్, పుర్లేశ్, రాజు, పవన్, భాస్కర్, చంటి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# మహాకవి 'గురజాడ'కి తీరని అపచారం

## లోక్‌సత్తా నాయకుల నిరసన దీక్ష




ఆధునిక తెలుగుభాషా సాహిత్యానికి గౌరవం పెంచిన చరిత్రకారుడు, మహాకవి గురజాడను రాష్ట్ర ప్రభుత్వం తీరని అవమానానికి గురిచేసిందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి భీశెట్టి బాబ్జీ ఆరోపించారు. గురజాడ విగ్రహం వద్ద నిరసన దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబర్ నెలలో జరిగిన గురజాడ 150వ జయంతి ముగింపు ఉత్సవంలో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, సాంస్కృతిక శాఖ మంత్రి వట్టి వసంతకుమార్, జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ అనేక హామీలు గుప్పించారని, గురజాడ స్మారక చిహ్నాలుగా హైదరాబాద్, విజయనగరాలలో ఒక్కొక్కచోట రెండేసి కోట్లతో రెండు స్మారక కళామందిరాలు నిర్మిస్తామని, గురజాడ గౌరవం పెంచేలా ఆయన ఇంటిని 15 లక్షలతో ఆధునీకరించి పర్యాటక కేంద్రంగా తయారు చేస్తామనడం, గురజాడ అడుగుజాడలకు గుర్తుగా తపాలా బిళ్ళ విడుదల చేస్తామని ఉత్తర ప్రగల్భాలు పలికారని ఆయనన్నారు. ఇచ్చిన హామీలు, వేసిన శిలాఫలకాలు ప్రజలవైపు బిత్తరచూపులు చూస్తున్నాయని ఎద్దేవా చేసారు. తెలుగుజాతికి సాహిత్యరంగంలో మార్గం చూపించిన గురజాడ అప్పారావుకి ఇంతటి అవమానం జరిగినందుకు సాహితీ కళారంగాలలో ఉన్న అభిమానులు తీవ్ర మనోవేదనకి గురౌతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తగిన వివరణ ఇవ్వకపోతే 21న జరగనున్న గురజాడ 151వ జయంతి ఉత్సవాలలో ప్రభుత్వపరంగా ఎవ్వరినీ పాల్గొనీయకుండా అడ్డుకుంటామని ఆయన చెప్పారు. పార్టీ జిల్లా కార్యదర్శి కె.దయానంద్‌శర్మ మాట్లాడుతూ మన నాయకులు, అధికారుల తీరుని ముందే గ్రహించిన గురజాడ అప్పారావు తన కన్యాశుల్కం నాటకంలో మనవాళ్లు "ఒట్టి వెధవాయిలోయ్" అని చెప్పకనే చెప్పారని ఎద్దేవా చేసారు. ఈ కార్యక్రమంలో చింతపూడి అప్పలరాజు, ఆర్.సుధాకర్, పి.వి.రమణ, మొల్లేటి నాయుడు, తిప్పాన కోటేశ్వరరావు, శివరామారావు, దామోదర్, యం.సుభద్రాదేవి, యం.యస్.యన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సత్తాతోనే నేర రహిత సమాజం

**కోదాడ**

లోక్‌సత్తా పార్టీతోనే నేర రహిత సమాజం ఏర్పడుతుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిమారుత్ పేర్కొన్నారు. స్థానిక శ్రీ విద్య కళాశాల ఆవరణలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విలువలు పతనమవుతున్న నేటి పరిస్థితిలో లోక్‌సత్తాకు సహకరించాలని కోరారు. సమాజంలో అవినీతిని నిర్మూలించేందుకు లోక్‌సత్తా పార్టీ ఆవిర్భవించిందన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడు సాతులూరి గోవిందరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎస్‌వీఎస్ నర్సింగ్ హోమ్ నిర్వాహకులు రావిళ్ల రవికుమార్‌తో పాటు 60 మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. సమావేశంలో నాయకులు నరేంద్ర, సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి, యశ్వంత్, షబీర్ పాల్గొన్నారు.




విశాఖ (నార్త్)లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బీశెట్టి బాబ్జీ ఆధ్వర్యంలో
జనచైతన్య యాత్ర



పార్టీ 7వ వార్షికోత్సవానికి
హైదరాబాద్‌లో సన్నాహక సమావేశం



పార్టీ ఆఫీసులో తెలంగాణ విమోచన దినోత్సవంలో జేపీ

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15 Published on 1st October, 2013





కూకట్‌పల్లి నియోజకవర్గంలో ముళ్లకత్తువ చెరువు అభివృద్ధి పథకాన్ని ప్రారంభించిన
ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, శాసనసభ్యులు జేపీ

To,

**Book-Post**

PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**

8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad